MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 6 రంగారెడ్డి ఫిబ్రవరి 2022 పేజీలు : 36 వెల : రూ. 10/-



## స్మరజిత్ రే స్మారక చర్చా గోష్ఠి !




'జూమ్' చర్చా గోష్ఠిలో పాల్గొన్నవారు :
పై వరుస : శ్రీ బబ్లు గంగూలి, శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీ రాజీవ్ అహల్
క్రింది వరుస : శ్రీ రంగనాథ్ , శ్రీమతి నందితా రే




శ్రీ ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సారథ్య సంఘ సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి



యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగావ్ జిల్లాల ఎఫ్ పి ఓల పాలకవర్గ సభ్యులకు మూడురోజుల శిక్షణలో ఒక దృశ్యం




ఆదిలాబాద్ గ్రామీణ మండలం 'రైతు సాధికారత ఎఫ్ పి సి' ప్రథమ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఒక దృశ్యం

NABARD
నాబార్డ్ సౌజన్యంతో



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
You Tube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 6




సంపాదకీయం

## అవగాహన ... ఆచరణ !

**వ్య**వసాయం ఏడాది పొడవునా చేసేది కాదు, ఏదో కొద్ది కాలానికే పరిమితం అని కొందరు అనుకోవడం కద్దు. కాని అది సరి కాదు. ఆసక్తి, ఉత్సాహం, అవగాహన, ఆచరించాలనే తపన వుండే రైతుకు సంవత్సరమంతా చేతినిండా పని, చేని నిండా పంట! నేల స్వభావాన్నిబట్టి కొన్ని పొలాలు కొన్ని రకాల పంటలకు సరిపడక పోవచ్చు. కాని ఆ పొలాలలో మరెన్నో పంటలు పండించవచ్చు. వచ్చిన చిక్కల్లా మనం ఏవో కొన్ని సాంప్రదాయిక పంటలకు అలవాటుపడి, వాటికి అనువైన వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత మొదలైనవి వుంటేనే సాగు చేయగలం లేకపోతే మనమేం చేయలేం అనుకోవడం. కనీసం రెండు దశాబ్దాలకు పైగా ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న సమాచార, సాంకేతిక విప్లవ ఫలితంగా యిప్పుడు మారుమూల పల్లెలలో సైతం ఎన్నో వినూత్న విశేషాలు, సరికొత్త పరికరాలు, ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడెక్కడి విషయాలు చిటికెలో నాలుగు మూలలకు తెలిసిపోతున్నాయి. అందువల్ల ఆసక్తి వుండాలేకాని, ఏడాది పొడవునా అనువైన కొత్త పంటలు అనేకం పండించి, తగిన ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలు పుష్కలంగా వుంటున్నాయి. రైతు సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు) యిలాంటి విషయాలపై దృష్టిపెట్టడం అవసరం. రైతు ఆదాయం పెరగాలంటే ఎఫ్ పి ఓ లే సరైన మార్గమని ప్రపంచమంతా విశ్వసిస్తున్నది. మన ప్రభుత్వాలు కూడా ఎఫ్ పి ఓలను ఏర్పాటు చేయడానికి, వాటిని వ్యాపార సంస్థలుగా పటిష్ఠపరచడానికి అధిక ప్రాధాన్యం యిస్తున్నాయి. ఇటీవలే మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడి స్వయంగా ఎఫ్ పి ఓల ప్రతినిధులతో మాట్లాడడం ఇందుకొక ఉదాహరణ. ప్రభుత్వాలు ఎఫ్ పి ఓలకు యిప్పుడు అనేక సదుపాయాలు సమకూరుస్తున్నాయి, అవసరాలను తీరుస్తున్నాయి. ఇంకా చేయవలసినదెంతో వున్నప్పటికి ఈ సానుకూల వాతావరణాన్ని ఎఫ్ పి ఓలు, రైతులు సద్వినియోగం చేసుకుని లభ్యమయ్యే ప్రయోజనాలను అందిపుచ్చుకోగలగాలి. ముఖ్యంగా ఎఫ్ పి ఓలు తమ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై , అవకాశమున్నంతవరకు ప్రాసెసింగ్ చేసుకుని ఉత్పత్తుల విలువను పెంచుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలి. సభ్య రైతులు పండించే అన్ని ప్రధాన పంటలకు మెరుగైన మార్కెట్లను ఎప్పుడూ అన్వేషిస్తుండాలి. ముందే అనుకున్నట్టు ఎఫ్ పి ఓలు సభ్య రైతుల ప్రయోజనంకోసం ఏడాది పొడవునా అప్రమత్తంగా వుంటూ రైతు ఆదాయం పెరుగుదలకు తోడ్పడాలి. మార్కెటింగ్ తో పాటు జమాఖర్చులు, ఆదాయవ్యయాల లెక్కలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ, పుస్తక నిర్వహణ సక్రమంగా సాగిస్తూ, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, రైతుల నమ్మకం చూరగొనగలగాలి. సభ్యరైతుల అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త వనరులను,సదుపాయాలను సమకూర్చకోగలగాలి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వంటి వ్యవసాయ ప్రాథమిక అవసరాల క్రయ విక్రయాలకు కావలసిన లైసెన్సులను పొందడానికి ప్రాధాన్యం యివ్వాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి పంటలు పండించాలో తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెద్ద మార్కెట్లకు , ప్రాసెసింగ్ యూనిట్లకు ఒప్పందాల మేరకు సరఫరా చేయడంతో పాటు , చుట్టుపక్కల చిన్నపాటి మార్కెట్లలో తగిన ధర లభించే అంశాన్ని కూడా గమనిస్తుండాలి. వీలున్నంతవరకు సహజ వ్యవసాయానికి వీలుగా విత్తన క్షేత్రాలను నిర్వహించడం, ఎరువులను , పురుగు మందులను తయారుచేసుకోవడం వంటి కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలి. చిరుధాన్యాల ఆవశ్యకతను, ప్రాధాన్యాన్ని గమనిస్తూ తగినంతగా చిరుధాన్యాల పంటలను కూడా పండించాలి. ఎఫ్ పి ఓ లు ఎంతగా సభ్య రైతుల ప్రయోజనాలను నెరవేర్చగలిగితే అంతగా కొత్త రైతులు తాము కూడా ఎఫ్ పి ఓ లలో చేరాలని ఆశిస్తారు. ఎంతమంది రైతులు సభ్యులుగా వుంటే ఆ ఎఫ్ పి ఓ అంతగా నాణ్యమైన ఉత్పత్తులతో పెద్ద మార్కెట్లను ఆకర్షించగలుగుతుంది, ఆ సభ్య రైతులు అంతగా ఆదాయాన్ని పొందగలుగుతారు. ఏపిమాస్ తన వంతుగా, ఈ అంశాలన్నిటిపైన తన నిర్వహణలోని ఎఫ్ పి ఓల పాలకవర్గాలకు, సి ఇ ఓ లకు, రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. కావలసింది ఈ అవగాహనను అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోగల నేర్పు , ఓర్పు. ఆ సామర్థ్యం వుంటే అఖండ విజయం మన వెంటే !


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- నేల, చెట్లు, పశువులతో కూడిన సేద్యమే మేలు ...05
- ఎఫ్ పి ఓలు ... రైతు సంక్షేమ సోపానాలు ! ...06
- జైకిసాన్ ఎఫ్ పి ఓ కు శిక్షణ భవనం, గోదాము!...09
- సబ్బుల తయారీతో గిరి మహిళల విజయం! ...10
- పట్టుగూళ్ళతో కనువిందుచేసే ఆభరణాలు ! ...11
- ఎఫ్‌పిఓలకు కేంద్రం రూ.15 లక్షల సాయం ! ...12
- ఎఫ్‌పిఓలుగా ఏర్పడండి ... మోడీ పిలుపు! ...14
- వాతావరణంతో నిరాశలో మామిడి రైతు ...16
- మామిడిని ఆశించే పురుగులు...సస్యరక్షణ ...18
- పూత నిలవక, పిందె రాక 'కంది'పోతున్న రైతు! ...23
- తప్పు చేసేది ఎవరైనా ... శిక్ష రైతుకే ! ...24
- అకాల వర్షాలవల్ల తెగుళ్ళతో శనగ రైతు గుల్ల ...25
- యువత తలిస్తే వ్యవసాయానికి భవిత ...26
- ఎరువుల ధరల రోకటిపోటుపై పురుగుమందులు ...27
- ఆరోగ్య బీమాలో రెండు షరతులపై జాగ్రత్త ! ...28
- వంట నూనెను ఇలా వాడితేనే మేలు! ...30
- అణు ఇంధన నౌకకు మహిళా కమాండర్ ...31
- ఉదయాన్నే నిమ్మ రసం...ఆరోగ్యానికి అభయం! ...32
- కుంకుళ్ళతో ఎన్నో రకాల ఉపయోగం ...33
- సత్య, సుందర్, బయోటెక్ అధినేతలకు పద్మభూషణ్ ..34


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

కలను కళ్లలో దాచుకుంటే కరిగి కన్నీరవుతుంది, గుండెలో పాదుపుకుంటే నెరవేర్చుకునే ప్రేరణ ఇస్తుంది

# నేల, చెట్లు, పశువులు కలగలిసిన సేద్యమే మేలు !

– జె వి క్రిష్ణమూర్తి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపట్ల , గ్రామీణ ప్రజల సంక్షేమాభివృద్ధిపట్ల ఎంతో అంకితభావంతో, ఆసక్తితో తన జీవితమంతా కృషిచేసిన మానవతావాది, ఏపిమాస్ (మహిళాభివృద్ధి సొసైటీ) వ్యవస్థాపనలో తన మార్గదర్శకత్వంతో ఎంతో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య కార్యదర్శి, కీర్తిశేషులు స్మరజిత్ రే కు స్మృత్యంజలి సూచకంగా ఏపిమాస్ 2005 లో ఆయన మరణానంతరం దాదాపు ప్రతి ఏటా ఆయన జయంతి రోజున స్మరజిత్ రే స్మారక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నది. ఆ కోవలో ఈ జనవరి11 వ తేదీన హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుంచి పరోక్ష సమావేశం (వర్చుయల్ జూమ్ మీటింగ్) విధానంలో 'వ్యావసాయిక పర్యావరణం: వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యూహానుసరణ' (ఆగ్రో ఎకాలజీ: ఎ వయబుల్ క్లైమేట్ ఛేంజ్ అడాప్షన్ స్ట్రాటజీ) అనే అంశంపై స్మరజిత్ రే స్మారక చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని ఏపిమాస్ నిర్వహించింది. ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ చర్చాగోష్ఠిలో టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ బబ్లూ గంగూలీ, భారతీయ విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఐ ఐ ఎస్ఇ)కు చెందిన సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీనెన్ హెచ్ రవీంద్రనాథ్, జర్మనీకి చెందిన జి ఐ జడ్ సంస్థ భారతదేశ శాఖలో సహజ వనరుల నిర్వహణ విభాగం సంచాలకులు శ్రీ రాజీవ్ అహల్ ప్రధాన వక్తలుగా (ప్యానలిస్ట్‌లుగా) పాల్గొన్నారు.

ముందుగా శ్రీ స్మరజితే రే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని శ్రీ సి ఎస్ రెడ్డి ప్రారంభించారు. తర్వాత ఏపిమాస్‌తో శ్రీ స్మరజితే రే అనుబంధాన్ని ప్రతిబింబించే ఛాయాచిత్రాలు, శ్రీ స్మరజితే రే స్మారకార్థం యిప్పటివరకు నిర్వహించిన 11 స్మారక కార్యక్రమాల చిత్రాలతో కూడిన స్లయిడ్ షోను శ్రీమతి లిఖిత ప్రదర్శించారు.

అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి తన స్వాగతోపన్యాసంలో స్మరజిత్‌రే విశిష్ట వ్యక్తిత్వాన్ని గురించి, ఏపిమాస్ కు ఆయనతోవున్న అనుబంధాన్ని గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తనకు యిటు సంతోషం, అటు బాధ రెండూ కలుగుతున్నాయని ఆయన అన్నారు. వారంరోజులక్రితమే ఎఫ్ పి ఓల ప్రతినిధులతో సహజ వ్యవసాయం ఆవశ్యకత గురించి ప్రధాని శ్రీ నరేంద్రమోడీ మాట్లాడారని, ఇంతటి ప్రాధాన్యాంశాన్ని గురించి చర్చిస్తున్నందుకు ఆనందం, నాడు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల అనుబంధానికి, అనుసంధానానికి కృషిచేసిన శ్రీ స్మరజిత్ రే ఎన్ జి ఓల పట్ల ప్రభుత్వాల వైఖరి దారుణంగా తయారైన నేటి పరిస్థితిలో లేకపోయారే అనే బాధ కలుగుతున్నాయని ఆయన అన్నారు.

తర్వాత గ్రామీణాభివృద్ధి పట్ల పేదరిక నిర్మూలన పట్ల శ్రీ స్మరజిత్ రే ఆశయాలు, అంకితభావం, ఆచరణ గురించి ఏపిమాస్ తో ఎంతో అనుబంధం కలిగి, యిటీవలి వరకు ఏపిమాస్ పాలకవర్గ సభ్యురాలిగా పనిచేసిన ఆయన భార్య శ్రీమతి నందితా రే క్లుప్తంగా వివరించారు. ఐతే గ్రామీణాభివృద్ధి పట్ల , వ్యవసాయరంగాన్ని మెరుగుపెచడంపట్ల ప్రభుత్వాలు మనస్ఫూర్తిగా శ్రద్ధ చూపకుండా, అన్యమనస్కంగా వ్యవహరిస్తుండడం, గ్రామీణ-పట్టణ అంతరం క్రమేణ తగ్గడానికి బదులు పెరుగుతుండడం బాధాకరంగా వున్నదని ఆమె తన ప్రసంగంలో ఆందోళన వ్యక్తంచేశారు.

అనంతరం శ్రీ బబ్లూ గంగూలీ మాట్లాడుతూ, తన అన్నా వదినెలు శ్రీ స్మరజిత్ రే, శ్రీమతి నందితా రే అనంతపురం జిల్లాలో నెలకొల్పిన టింబక్టూ కలెక్టివ్ సంస్థ గురించి, ఆ సంస్థకు సొంత నిధులతో శ్రీమతి రే వంద ఎకరాల వ్యవసాయ భూమిని కొని యివ్వడాన్ని గురించి, దానికి తాను ఒక ధర్మకర్తగా

*(మిగతా 15 వ పేజీలో....)*

నిన్ను గుడ్డిగా నమ్మేవారికి , వారి నమ్మకం గుడ్డిదని నిరూపించడం తెలివైన పనేనా ?

# ఎఫ్ పి ఓలు ... రైతు సంక్షేమ సోపానాలు !

– ఎస్.ప్రహల్లాద

**భా**రతదేశంలో స్వయం సహాయ మహిళా సంఘాలు వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలతో చరిత్ర సృష్టించాయి. 1970 సంవత్సరం నుండి చెదురుమదురుగా ప్రారంభమైన స్వయం సహాయ మహిళా సంఘాలు 1982లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "డ్వాక్రా" పథకంతో ఊపందు కున్నాయి. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వాలు, మరోవైపు కేంద్ర ప్రభుత్వ సంస్థలు వివిధ రకాల పథకాలతో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నందువల్ల ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నాయి.



మహిళా సంఘాల స్ఫూర్తితో రైతు సంఘాలు సంఘటిత పథంలో ముందడుగు వేస్తున్నాయి. దేశంలో ఇప్పటికే వేల సంఖ్యలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ పి ఓలు) వుండగా మరో 10 వేల సంఘాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించి మార్గదర్శకత్వం వహించుటకు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నాబార్డ్, ఎస్ ఎఫ్ ఎ సి, ఎన్ సి డి సి, ఎన్ ఎ ఎఫ్ ఇ డి అనే నాలుగు సంస్థలను కేంద్రం ఎంపిక చేసింది. ఈ నాలుగు సంస్థలు రాష్ట్రాలలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహించుటకు, తిరిగి ప్రతి రాష్ట్రంలో కొన్ని క్లస్టర్ స్థాయి వ్యాపార సంస్థలుగా ఏపిమాస్ లాంటి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలను (ఎన్జీవోస్) ఎంపిక చేసింది. ఈ స్వచ్ఛందసంస్థలు తామే నేరుగాను, భాగస్వామ్య సంస్థల ద్వారాను దేశంలో చిన్న,సన్నకారు రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటులో పురోగమిస్తున్నాయి.

**రైతు ఉత్పత్తిదారుల సంస్థ అంటే ... ?**

రైతు ఉత్పత్తిదారుల సంస్థ అనగా రైతులు తమ ఉమ్మడి అవసరాలను తీర్చుకొనుటకు స్వచ్ఛందంగా, స్వతంత్రంగా ఏర్పాటు చేసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించుకునే స్వయంప్రతిపత్తి గల వ్యాపారాత్మక సంస్థ. ఇది సభ్యుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని, రైతులే యజమానులుగా ఏర్పాటు చేసుకున్న సంస్థ. సంస్థ చేపట్టే వివిధ రకాల కార్యక్రమాల రూపకల్పనను, అమలును సంస్థచే ఎన్నుకోబడిన పాలక కార్యవర్గం నిర్వహిస్తుంది.

**సొంత కార్యక్రమాలు ... స్వయం నిర్వహణ**

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు తమ సభ్యుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలను రూపొందించుకొని అమలు చేయవచ్చు. అనగా రైతులకు కావాల్సిన వివిధ రకాల వ్యావసాయిక పదార్థాలు, పరికరాలు, పనిముట్లు, పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారం మొదలైన వాటిని చేపట్టవచ్చు.

**రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు లభించే ప్రయోజనాలు**

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు చేపట్టే వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, ప్రముఖ ప్రైవేట్ సంస్థలు, విదేశీ సంస్థలు నిధులను సమకూరుస్తాయి. నిధులు సమకూర్చే ప్రధాన అంశాలు:



- రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయ నిర్వహణ వ్యయాలు అనగా కార్యాలయ అద్దె, సిబ్బంది వేతనాలు, కరెంట్ చార్జీలు, తదితర ఖర్చులను మూడు సంవత్సరాల వరకు పూర్తిగా సమకూరుస్తారు
- సంస్థ చేపట్టే వివిధ రకాల వ్యాపార కార్యక్రమాల కొరకు సంస్థలోని వాటాధనం ప్రాతిపదికగా 15లక్షల రూపాయల వరకు ఈక్విటి గ్రాంట్‌లను మంజూరు చేస్తారు
- సంస్థ తమ సభ్యుల మార్కెటింగ్ అవసరాల కోసం ''కూరగాయల సేకరణ కేంద్రాన్ని'' ఏర్పాటు చేసుకోవడానికి 75% నిధులను సబ్సిడిగా అందిస్తారు.
- తమ సభ్యులు పండించే వివిధ రకాల ఉత్పత్తుల మార్కెటింగ్ రవాణా అవసరాల కొరకు రవాణా వాహనాల కొనుగోలుకు 75% నిధులను పొందవచ్చు.
- సభ్యులు పండించే వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పూలు, చింతపండు మొదలగునవి నిలువ చేసు కొనుటకు అవసరమైన శీతలీకరణ గిడ్డంగులఏర్పాటుకు 75% నిధులను పొందవచ్చు.
- కేంద్ర ప్రభుత్వ "ఒక జిల్లా-ఒక ఉత్పత్తి " (వన్ డిస్ట్రిక్ట్ -వన్ ప్రోడక్ట్) పథకంలో భాగంగా ప్రధానమంత్రి చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్యక్రమం క్రింద 35% సబ్సిడీ, బ్యాంక్ ఋణంతో రైతుల అవసరాలకు తగిన వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టవచ్చు.

**రైతుల పురోగతిలో భాగస్వామిగా ఏపిమాస్**

- మహిళలు , రైతుల అభివృద్ధిలో భాగస్వామిగా ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహారు రాష్ట్రాలలో ప్రత్యక్షంగా, మరికొన్ని రాష్ట్రాలలో ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో సేవలను అందించడంలో 20 వసంతాలు విజయవంతంగా పూర్తి చేసుకొని, మరింత దృఢ దీక్ష తో తన సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నది. దాదాపు 53 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేసి, 45 వేల కుటుంబాలకు వివిధరకాల సేవలను అందిస్తున్నది. 2030 నాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండున్నర లక్షల అట్టడుగు వర్గాల (ఎస్సీ, ఎస్టీ, చిన్న కమలాల రైతులు, యువత, గ్రామీణ మరియు పట్టణ పేదలు) కుటుంబాలతో స్వావలంబన కలిగిన సంస్థల ను నిర్మించి వారికి వివిధ రకాల సేవలనందించాలనే సంకల్పంతో అనేక ప్రణాళికలను రూపొందిస్తున్నది.

**చిత్తూరు జిల్లాలో రైతు ఉత్పత్తిదారు సంస్థల ప్రగతి**

- ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో

- ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో అంచెలంచెలుగా తమ కార్యక్రమాలను , పరిధిని విస్తరించుకుంటూ విజయవంతంగా సేవలందిస్తున్నది. ప్రస్తుతం జిల్లాలోని 21మండలాలలో (రామసముద్రం, మదనపల్లి, నిమ్మనపల్లి, పలమనేరు, వి.కోట, కురబలకోట, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, కలకడ, బి.కొత్తకోట, పెద్దమండ్యము, తంబళ్లపల్లి, సోమల, సదుం, పెద్దతిప్ప సముద్రం, పుంగనూరు, బైరెడ్డిపల్లి, విజయపురం, నాగలాపురం, రామచంద్రాపురం) 23 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేసి తద్వారా 10,600 కుటుంబాలను సభ్యులుగా చేర్చుకొని వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నది.

**చిత్తూరు జిల్లలోని రైతుల కొరకు ఉత్పత్తిదారు సంస్థల ద్వారా ఏపిమాస్ అందించే వివిధ పథకాలు:**

- టమాట పంటలో వివిధ రకాల యాజమాన్యపద్ధతులపై రైతులను చైతన్యపరిచి పంట ఖర్చులను తగ్గించే 'హరిత వినూత్న కేంద్ర పథకం (జిఐసి)'. ఇది జర్మనీ దేశ ఆర్థిక సహాయంతో 8 మండలాలలో అమలు జరుగుతున్నది.



- కేంద్ర ప్రభుత్వపు 'ఆపరేషన్ గ్రీన్స్ (ఓజి)' పథకంలో భాగంగా ఎఫ్.పి.ఓ స్థాయిలో ఒక 'సమీకృత ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాన్ని', ఒక ఆదర్శ నర్సరీని, ఒక పాలీహౌస్‌ను ఏర్పాటు చేస్తారు.
- కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమశాఖ ద్వారా ఎఫ్‌పిఓ లను 'వ్యాపార సంస్థలుగా' రూపొందించి, బలోపేతం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తుంది.
- రైతులలో 'పశుగ్రాస భద్రత, పౌష్టికాహార ప్రాధాన్యతను' పెంపొందించే 'పాడి పంటలు' కార్యక్రమం. ఈ పథకానికి లక్సంబర్గ్ దేశానికి చెందిన ఏ.ఈ.ఐ.ఎన్ సంస్థ సహకారం అందిస్తున్నది. (కురబలకోట, వాల్మీకిపురం మండలాలు)
- పీలేరు ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి
- ఎన్.సి.డి.సి వారి క్లస్టర్ స్థాయి వ్యాపార సంస్థల పథకం
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని పేద కుటుంబాలను నీరు, ఆరోగ్యం , పారిశుధ్యం ప్రాధాన్యతపై చైతన్యపరిచే 'వాష్' కార్యక్రమం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ తోడ్పాటుతో ఎఫ్.పి.ఓలను ఏర్పాటుచేసి వాటిని వ్యవసాయ వ్యాపార సంస్థలుగా అభివృద్ధి పరిచే పథకం (యంఐడిహెచ్)

**ముఖ్య ప్రగతి సూచికలు**

- ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థకు అర్హత, అనుభవం కలిగిన వారిని ముఖ్య కార్యనిర్వహణాధికారులుగా నియమించి, వారికి నిరంతరంగా శిక్షణలు అందిస్తూ వారి సామర్థ్యాలను పెంపొందించడం
- ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థకు కార్యాలయాల ఏర్పాటు
- సభ్య రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా 9 మండలాలలో ప్రభుత్వ లైసెన్స్‌లను పొంది ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, పశువుల దాణా మొదలగు వాటిని సభ్య రైతులకు అందుబాటులో ఉంచింది
- మరో 7 మండలాలలో సభ్య రైతులకు పశువుల దాణా, టార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్లు మొ॥వి అందిస్తున్నారు.
- సభ్య రైతులకు చెందిన పశువుల ఆరోగ్య సంరక్షణ కొరకు 'వైద్య శిబిరాలు" ఏర్పాటు చేస్తున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా ఇద్దరు పశువైద్య అధికారులను నియమించింది.
- ప్రత్యేకంగా నియమించిన ఉద్యాన సాంకేతిక అధికారుల ద్వారా రైతులకు పొలం బడులను ఏర్పాటు చేసి పంట యాజమాన్య పద్ధతులపై రైతులను చైతన్య పరుస్తున్నది.

పైన తెలిపిన వివిధ సేవల ద్వారా ఏపిమాస్ సంస్థ రైతుల అభ్యున్నతికి ఎంతగానో ఫలవంతంగా కృషి చేస్తున్నది. ■

# జైకిసాన్ ఎఫ్ పి ఓ కు శిక్షణ భవనం, గోదాము!





సంగారెడ్డి కేంద్రంగా, ఆరు గ్రామాల రైతులు సభ్యులుగా ఏర్పాటైన ' జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ ' (జై కిసాన్ ఎఫ్ పి ఓ) అరబిందో ఫార్మా ఆర్థిక సహకారంతో, ఏపిమాస్ తోడ్పాటుతో సొంత కార్యాలయ, శిక్షణ భవనాన్ని; వ్యవసాయ ఉత్పత్తులు , ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను నిల్వచేయడానికి గోదామును నిర్మించుకున్నది. ఈ భవనాలు త్వరలో ప్రారంభోత్సవంకోసం నిరీక్షిస్తున్నాయి. ఈ భవనాల నిర్మాణానికి కావలసిన స్థలాన్ని రెడ్డి ఖనపూర్ గ్రామస్తులు సమకూర్చారు. జై కిసాన్ ఎఫ్ పి ఓ సంఘ సభ్యులకు శిక్షణలను, అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేస్తుంది. డెమోప్లాట్లను ఏర్పాటుచేసి సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో శిక్షణ యిస్తుంది. భాగస్వామ్య విధానంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల ద్వారా ప్రభుత్వ పథకాలపైన, వరి,పత్తి పంటల సాగులో పాటించవలసిన పద్ధతులపైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమాల నిర్వహణకోసం ఎఫ్ పి ఓ కు కార్యాలయంగా ఉపయోగపడడానికి, సంఘ సభ్యులకు శిక్షణలు ఇవ్వటానికి సొంత కార్యాలయ, శిక్షణ భవనాన్ని, రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచటానికి గోదాము భవనాన్ని నిర్మించుకోవాలని జై కిసాన్ ఎఫ్ పి ఓ పాలకవర్గం సంకల్పించి, ప్రణాళిక రూపొందించుకుని, భవనాల నిర్మాణాన్ని పూర్తిచేసింది. ■

## ఒంటరి తల్లుల బిడ్డలకు తల్లి కులం ధ్రువీకరణ!

భర్త నుంచి విడాకులు పొందిన, భర్త మరణించిన భార్యలు తమ బిడ్డలకు తమ కులాన్నిబట్టి కుల ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఓ ఒంటరి తల్లి సామాజిక నేపథ్యం ఆధారంగా ఆమె బిడ్డకు జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాన్ని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్శిశోడియా 4-01-22న అందజేశారు. ఎనిమిదేళ్ళపాటు ఆమె చేసిన కృషికి ఫలితం దక్కింది.గతంలో ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను తండ్రి కులం ఆధారంగా, పితృవర్గం కులం ఆధారంగా జారీ చేసేవారు. దీనివల్ల చాలామంది ఒంటరి తల్లులు తమ బిడ్డలకు ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను పొందలేక పోయేవారు. ఫలితంగా ఉపకార వేతనాలు, రిజర్వేషన్లను కోల్పోయేవారు. అలాంటివారిలో గీతా దేవి ఒకరు. ఆమె తన బిడ్డకు కుల ధ్రువీకరణ పత్రం పొందడం కోసం ఎనిమిదేళ్ళ నుంచి శ్రమిస్తున్నారు. ఆమె దరఖాస్తును అధికారులు అనేకసార్లు తిరస్కరించారు. అయినా ఆమె పట్టువీడకుండా ప్రయత్నిస్తూనే ఉన్నారు. గీతాదేవి కృషి ఫలించి, తన కుమారునికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని పొందగలిగారు. ఒంటరి తల్లి కులం ఆధారంగా ఆమె బిడ్డకు జారీ చేసిన మొట్టమొదటి కుల ధ్రువీకరణ పత్రం ఇదే. ■

**మాటలతో, చేతలతో నొప్పించే వారికంటె, ఆత్మీయుల అనాదరణ మరింత బాధాకరం**

# సబ్బుల తయారీతో గిరి మహిళల విజయం!

**వ్యా**పార సూత్రాల గురించి వాళ్లకేమీ పెద్దగా తెలియదు.. కానీ సబ్బుల తయారీ మొదలుపెట్టిన ఏడాదికే అరవైలక్షల రూపాయల వ్యాపారం చేసి శభాష్ అనిపించు కున్నారు. కొవిడ్ వంటి సవాళ్లు ఎదురైనా వెనుతిరగలేదు. తెలంగాణా రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన గిరిజన మహిళల విజయం ఇది..

చదివింది అంతంత మాత్రమే. దాంతో కూలి పనులకే పరిమితం అయ్యారు ఏటూరు నాగారంలోని గిరిజన మహిళలు. కానీ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా ఆలోచన వాళ్ల జీవితాలను మలుపుతిప్పింది. ఈ మహిళలతో



డిటర్జంట్ సబ్బులను తయారుచేయిస్తే బాగుం టుందని ఆవిడ ఆలోచించారు. చాలామంది మహిళలు ఇది అయ్యేపని కాదులే అని నిరాశపడినా శివాపురం గ్రామానికి చెందిన 18 మంది ముందుకు వచ్చారు. వీళ్లందరికీ ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఆర్నెల్లు శిక్షణ ఇప్పించింది. తర్వాత బ్యాంకు రుణంతో సబ్బుల తయారీ యూనిట్‌ని పెట్టమని సలహా ఇచ్చింది. శిక్షణ తీసుకున్నారు కానీ... రుణం దొరకలేదు. చేసేదిలేక ఐటీడీఏ అధికారుల దగ్గరకే వెళ్లి విషయం చెప్పారు. వాళ్ళ పట్టుదలను గమనించిన జీసీసీ రూ. 28 లక్షల వరకు ఆర్థిక సాయం అందించింది. దాంతో 2019లో శివాపురం లోనే యూనిట్‌ని ప్రారంభించారు. శిక్షణ తీసుకున్న వాళ్ళలో కొంతమంది వెనక్కి తగ్గారు. కారణం... భాగస్వామ్యం కింద కొంత సొమ్ము చెల్లించాల్సి రావడమే. ఓ తొమ్మిదిమంది మాత్రం ధైర్యం చేసి 'శ్రీసమ్మక్క సారలమ్మ జేఎల్‌జీగ్రూపు'ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రూపు అధ్యక్షురాలు ధనసరి సౌజన్య గారు, కోరం లక్ష్మి గారు కార్యదర్శి. అందరిలో వీళ్లే కాస్త చదువుకున్నవాళ్ళు. పూనెం రమగారు, పూనెం రాములమ్మ గారు, పూనెం సీత గారు, చింత జ్యోతి గారు, సిద్ధబోయిన శరత్ గారు, ధనసరినర్సయ్య గారు గ్రూపు సభ్యులు. వీళ్లంతా 2019 డిసెంబర్ నుంచీ 'గిరి' పేరుతో సబ్బుల తయారీ మొదలు పెట్టారు. రోజుకు పదివేల సబ్బులు తయారు చేసేవారు. అలా మొదటి దశలోనే 2.79 లక్షల సబ్బులను గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేశారు. ఒక్కో సబ్బు రూ. 9. మొదటి దఫాలోనే రూ. 25 లక్షలు సంపాదించి, దాంతో జీసీసీ రుణాన్ని తీర్చేశారు. అలాగే ప్రభుత్వం రాయితీని కూడా ఇవ్వడంతో ఆ సొమ్ముతో ముడి సరుకు కొనుక్కున్నారు.

**ఒడిదుడుకులను అధిగమించి...**

'అంతా బాగుందనుకున్న సమయానికి కొవిడ్‌తో హాస్టళ్లు, పాఠశాలలు మూత పడ్డాయి. ఆర్డర్లు లేవు. తిరిగి కూలి పనులకు వెళ్ళాం. అయినా మనుపటి ఉత్సాహంతో లాక్‌డౌన్ తర్వాత సెప్టెంబర్‌లో మళ్ళీ యూనిట్‌ను ప్రారంభించాం. ఈ మూడు నెలల్లో మరో 4 లక్షల సబ్బులను తయారుచేసి పాఠశాలలకు సరఫరా



చేశాం. అలా ఏడాదిలోనే రూ. 60 లక్షల వ్యాపారం జరిగింది. బయట మార్కెట్లో ఈ సబ్బులకు డిమాండ్ పెరగడంతో ప్యాకింగ్‌లో మార్పులు చేసి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని అనుకుంటున్నాం. ఉదయం 10 నుంచి మొదలు పెట్టి సాయంత్రం 5 వరకు సుమారుగా 10వేల సబ్బులను తయారుచేస్తాం. గిరాకీ పెరుగుతుండటంతో సర్ఫ్, గిన్నెలు తోముకునే సబ్బులు కూడా చేయబోతున్నాం. ఈ పరిశ్రమను ఏర్పాటు చేయడం, విజయవంతంగా నడపడంతో చాలా ధైర్యం వచ్చింది. మా జీవితాల్లో మార్పులు వస్తున్నాయి' అని సంతోషంగా చెబుతోంది బృంద అధ్యక్షురాలు ధనసరి సౌజన్య.

(ఈనాడు సౌజన్యంతో)

■

**అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు**

# పట్టుగూళ్ళతో కనువిందుచేసే ఆభరణాలు !

పట్టు దారం తీసిన తర్వాత వృధాగా మిగిలే పట్టు గూడును అందమైన ఆభరణంగా ఈమె మార్చేయగలదు. వాటితో వందల ఏళ్ళక్రితం రాజవంశీకులు ధరించిన నగల డిజైన్లను సృష్టించి చూపించగలదు. ఒకప్పుడు కుటుంబ పోషణకోసం కూరగాయలు అమ్మిన ఆమె తన వైవిధ్య ఆలోచన, సృజనాత్మకతలతో ఆభరణాల డిజైన్‌లో నూతన ఒరవడిని తెచ్చింది. అతి తక్కువ పెట్టుబడితో ఈ రంగంలోకి అడుగుపెట్టి... ఓ కొత్త బ్రాండ్‌కు అధిపతిగా ఎదిగిన మణిపూర్‌కు చెందిన శ్రీమయుం గీతాదేవి స్ఫూర్తి కథనమిది.

ఖురైతొంగంలీకెయ్ గ్రామంలో నివసించే గీతాదేవి చిన్న వయసులోనే భర్తను కోల్పోయింది. ఇద్దరు పిల్లల పోషణ ఈమెదే కావడంతో ఇంటింటికీ తిరిగి కూర గాయలు విక్రయించేది. పేద మహిళలకు ఉపాధిని కల్పించేలా ఓ సామాజిక సేవాసంస్థ పట్టు పురుగుల పెంపకం, పట్టు ఉత్పత్తిపై ఇచ్చే శిక్షణ తరగతుల్లో చేరింది గీతాదేవి. అక్కడే పట్టు గూళ్లతో ఆభరణాల తయారీనీ నేర్చుకుంది. వీటితో చేసే నగల డిజైన్‌పై ఆసక్తి పెంచుకున్న ఈమె సాధనతో నైపుణ్యాన్ని పెంచుకుంది. క్రమేపీ చిన్నచిన్న నగలను తయారుచేయడం మొదలుపెట్టింది.



మణిపురిలో వందల ఏళ్లనాటి సంప్రదాయ నగలు, అప్పటి రాజవంశీయుల ఆభరణాల డిజైన్లను స్ఫూర్తిగా తీసుకున్న గీతాదేవి అందులో చాలా ప్రయోగాలు చేపట్టింది. ఈ హస్తకళలో తనకంటూ ఓ ప్రత్యేకతనూ సాధించింది. 'లీమాలిక్లాంగ్ నయీన్' పేరుతో సంస్థను స్థాపించింది. నెక్లెస్, చెవి లోలకులు, మాలలు, ఇంటి అలంకరణ ఉత్పత్తులు వంటివన్నీ పట్టు గూళ్లతో తయారుచేయడంలో తన సృజనాత్మకతను ప్రదర్శించింది. చిన్నచిన్న ప్రదర్శనలలో వీటిని ఉంచేది. అలా మొదట స్థానికులకు గీతాదేవి తయారుచేసే ఆభరణాలపై ఆసక్తి మొదలైంది. క్రమేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆభరణాలు విక్రయించే స్థాయికి ఎదిగిందీమె.

**అలనాటి డిజైన్లు...**

మొదట రూ. 3 వేలతో నగల తయారీని ప్రారంభించా అంటుంది గీతాదేవి. ఏడాది తర్వాత నాలో ఆలోచనను మెచ్చిన ప్రభుత్వం రూ. 3 లక్షల రుణం అందించింది. ఇది నాకెంతో తోడ్పడింది. నేను డిజైన్ చేస్తున్న నగలకు ఇప్పుడు మంచి పేరుంది. ఆన్‌లైన్‌లోనూ ఆర్డర్లు వస్తున్నాయి. వీటికి గత చరిత్ర ఉంది. మహారాణులు వారికోసం పట్టు చీరలను నేయించుకునేటప్పుడు పట్టు పరిశ్రమ ప్రత్యేకంగా ఉండేది. అక్కడ పట్టు గూడుతో నగలను డిజైన్ చేయించుకొని పండుగలకు, ప్రత్యేక కార్యక్రమాలకు ధరించేవారు. ఆ సంప్రదాయాన్ని అధ్యయనం చేసి వాటిని పోలినట్లే ప్రస్తుతం నేను డిజైన్ చేస్తున్నా. రాణుల కాలం తర్వాత క్రమేపీ ఈ తరహా నగలు తగ్గాయి. మేం ఈ గూళ్లను ముందుగా కూరగాయలతో తయారుచేసే రంగుల్లో ముంచి ఉడికించి తర్వాత కావల్సిన డిజైన్‌గా కత్తిరిస్తాం. వీటికి రంగు రంగుల రాళ్లు, పూసలు, ముత్యాలు వంటివి జత చేసి ఆభరణంగా మారుస్తాం.

ఒక నగ తయారీకి దాదాపు నాలుగు గంటలకుపైగా పడుతుంది. ఖర్చులు పోగా నెలకు రూ. 50 వేలు ఆదాయాన్ని పొందుతున్నా. స్థానికంగా గృహిణులకు ఉచితంగా శిక్షణ అందించి స్వయం ఉపాధి కల్పిస్తున్నా' అని చెబుతున్న 62 ఏళ్ల గీతాదేవి ప్రభుత్వ విభాగాలు, సామాజిక సేవాసంస్థలతో కలిసి దేశవ్యాప్తంగా క్రాఫ్ట్ బజారులలో ఈ ఆభరణాలను ప్రదర్శనకు ఉంచుతోంది. ఈమె కృషికి 'స్టేట్ క్రాఫ్ట్స్ పర్సన్' అవార్డు సహా పలు పురస్కారాలు దక్కాయి.

(ఈనాడు సౌజన్యంతో)

■

నవ్వించినా, ఏడ్పించినా గత స్మృతులు మనసును ఉత్తేజ పరుస్తూనే వుంటాయి

# ఎఫ్‌పిఓలకు కేంద్రం రూ.15 లక్షల సాయం !

## పలు వర్గాల సంక్షేమానికి వివిధ పథకాలు

రైతుల ఆదాయం రెండింతలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కొత్తగా వ్యావసాయిక వ్యాపారాలు ప్రారంభించుకునేందుకు రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ. 15 లక్షలను అందజేస్తుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఓ సరికొత్త పథకాన్ని అమలు చేస్తోంది. 'పి ఎం కిసాన్ ఎఫ్‌పీఓ స్కీమ్'ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ స్కీమ్ కింద రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ... ఎఫ్ పి ఓ లకు) రూ. 15 లక్షలను కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న రైతులు సరికొత్త వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారాలను (అగ్రికల్చర్ బిజినెస్‌లను) ఏర్పాటు చేసుకునేందుకు ఈ ఆర్థిక సాయాన్ని పొందవచ్చు. ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు 11 మంది రైతులు ఒక సంస్థగా లేదా కంపెనీగా ఏర్పాటు కావాల్సి ఉంటుంది. 'పిఎం కిసాన్ ఎఫ్‌పిఓ పథకం' కింద రైతులు ఇతర ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

ఈ పథకం ద్వారా రైతులు తేలికగా వ్యవసాయ పనిముట్లు, రసాయనాలు, విత్తనాలు, పురుగు మందుల వంటివి కూడా కొనుగోలు చేసుకోవచ్చు. ఈ పథకం నుంచి లభించే మరో ప్రయోజనం ఏమిటంటే, రైతులకు మధ్యవర్తుల నుంచి స్వేచ్ఛ లభిస్తుంది. ఎఫ్‌పిఓ విధానంలో రైతులు వారు పండించిన పంటలకు మంచి రేటు పొందుతారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్నితీసుకొచ్చింది.

**ఈ పథకం కింద డబ్బు పొందడమెలా..?**

- నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్ళాలి.
- మీ స్క్రీన్‌పై హోమ్ పేజీ ఓపెన్ అవుతుంది.
- హోమ్ పేజీపై ఎఫ్‌పీఓ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
- ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
- రిజిస్ట్రేషన్ ఫారమ్ ఓపెన్ అవుతుంది.
- ఫారమ్‌లో అడిగిన సమాచారం మొత్తాన్ని నింపాలి.
- ఆ తర్వాత పాస్‌బుక్‌ను లేదా క్యాన్సిల్ చెక్‌ను అప్‌లోడ్ చేయాలి.
- చివరికి సబ్‌మిట్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.

**అసంఘటితరంగ కార్మికులకు సాయం**

కోవిడ్-19తో నెలకొన్న ఆర్థిక, వ్యక్తిగత భారాల నుంచి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టింది. సమాజంలో ఉన్న పలు వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీ ఇన్సూరెన్స్ స్కీమ్ నుంచి ఈ-శ్రమ్ పోర్టల్ వరకు ఉన్నాయి.

అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఆర్థిక సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఈ-శ్రమ్' పోర్టల్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. కార్మికులు 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో రిజిస్టర్ అవ్వడం ద్వారా ఎన్నో రకాల ప్రయోజనాలను పొందవచ్చు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలకు ఈ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకుంటే, ఆ రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 500 ను ఆర్థిక సాయంగా అందిస్తోంది. మార్చి 2022 వరకు ప్రజల అకౌంట్లోకి ఈ డబ్బు వేస్తామని, 3 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు రాష్ట్రంలో ఉన్నారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పేర్కొంది.

అయితే దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది శ్రామికులు ఇప్పటివరకు ఈ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసు కున్నారు. ఇంకా చాలామంది కార్మికులు తమ పేర్లను ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. దేశవ్యాప్తంగా 38 కోట్ల మంది వరకు కార్మికులున్నారు. ఈ కార్డు ద్వారా

దేశవ్యాప్తంగా ప్రయోజనాలు పొందవచ్చు. కామన్ సర్వీసు సెంటర్‌కు వెళ్లి ఎప్పుడైనా కార్మికులు ఈ పోర్టల్‌లో నమోదు కావొచ్చు. కార్మికులు రిజిస్ట్రేషన్ సమయంలో ఎలాంటి డబ్బులు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం కార్మికులకు భారంగా మారిన పిల్లల చదువుకు కూడా ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా ఆర్థిక సాయం పొందవచ్చు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకున్న వారికి పి ఎం సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు బీమా కవరేజ్ లభిస్తుంది. దీనికోసం అసంఘటిత రంగంలోని కార్మికులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంతేకాక ఏదైనా ప్రమాదంలో మరణిస్తే లేదా శాశ్వత వికలాంగులైతే రూ.2 లక్షల బీమా, పాక్షికంగా వికలాంగులైతే రూ.లక్షను ప్రభుత్వం ఇస్తుంది. ఇవి మాత్రమే కాక పలు సామాజిక భద్రత ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుంది.

**ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు ఎలా ...?**

ఈ-శ్రమ్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్‌కి వెళ్లి దీనిలో రిజిస్టర్ చేసుకోవచ్చు. దీనికోసం ఆధార్ కార్డు, ఆధార్‌తో లింకైన మొబైల్ నెంబర్ ఉంటే సరిపోతుంది. యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)తో ఈ-శ్రమ్ కార్డును జారీ చేస్తారు. కామన్ సర్వీసు సెంటర్లు, స్టేట్ సేవా కేంద్రాలు, లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం 14434 టోల్ ఫ్రీ నెంబర్‌ని ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

**ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీ**

కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా వైద్య కార్మికులు రాత్రింబవళ్లు పని చేశారు. ఈ ఏడాది జూన్‌లోనే ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీ (పీఎంజేకేపీ) ఇన్సూరెన్స్ పథకాన్ని కరోనాతో పోరాడుతోన్న వైద్య కార్మికులకు మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం చెప్పింది. ఏప్రిల్ 24, 2021 నుంచి ఏడాది పాటు ఈ స్కీమ్ అమల్లో ఉంటుందని పేర్కొంది. ఈ పథకాన్ని తొలిసారి మార్చి 30, 2020న ప్రవేశపెట్టారు. తొలుత 90 రోజుల కోసం ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద ఏమైనా వ్యక్తిగత ప్రమాదం జరిగితే వైద్య కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం లభిస్తుంది. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ప్రైవేట్ హెల్త్‌వర్కర్లు అందరికీ ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది.

**పిఎం మెంటరింగ్ యువ పథకం**

2021 జూన్‌లో లాంచ్ చేసిన ఈ స్కీమ్ కింద దేశంలో యువ రచయితలను ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. యువ రచయితల కోసం రూపొందించిన పథకం ఇది. 30 ఏళ్ల లోపు ఉన్న రచయితలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, వారి మనోభావాలను వ్యక్తం చేసేలా ఈ పథకాన్ని రూపొందించారు. అంతర్జాతీయ వేదికపైకి భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను వీరు తీసుకెళ్ల నున్నారు. ఈ మెంటరింగ్ కార్యక్రమం ద్వారా యువ రచయితల కల్పన, నాన్-ఫిక్షన్, మెమోయిర్స్, డ్రామా, కవిత్వం వంటి వివిధ శైలిలో రాయడంలో నైపుణ్యం సాధిస్తారు.

**గ్రామ్ ఉజాలా పథకం**

గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన ఎల్ఈడీ బల్బులను కేవలం 10 రూపాయలకే పంపిణీ చేసేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. మార్చి 24, 2021లో ఈ పథకాన్ని లాంచ్ చేసింది ప్రభుత్వం. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) గ్రామీణ జనాభాలకు ఈ ఎల్ఈడీబల్బులను 10 రూపాయలకే అందిస్తోంది. కేవలం 10 రూపాయలకే బల్బులను అందుబాటులోకి తేవడంతో, గ్రామీణ ప్రజలకు మెరుగైన జీవనాన్ని, ఆర్థికంగా ఆదా, మెరుగైన రక్షణను ప్రభుత్వం అందిస్తోంది.

**రైల్ కౌశల్ వికాస్ యోజన**

ఆగస్ట్ 20,2021న ప్రభుత్వం ఈ పథకాన్ని ఆవిష్కరించింది. ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం యువతకు నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ అందివ్వడం. భారతీయ రైల్వే శిక్షణా సంస్థల ద్వారా పరిశ్రమల సంబంధిత నైపుణ్యాల విషయంలో ఎంట్రీ లెవల్ ట్రైనింగ్‌ను యువతకు అందించాలని భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎఫ్‌పిఓలుగా ఏర్పడండి ... చిన్న రైతులకు మోడీ పిలుపు!

దేశవ్యాప్తంగా ఉన్న చిన్న రైతు లంతా వ్యవసాయ ఉత్పాదకత సంఘాలుగా (ఎఫ్ పి ఓలుగా) ఏర్పడి తమ బేరసారాల శక్తిని పెంచుకోవాలని ప్రధాని మోదీ పిలుపు నిచ్చారు. నేల మన అమ్మ లాంటిదని, అది బంజరు కాకుండా కాపాడుకోవాలని కోరారు. ప్రాకృతిక వ్యవ సాయాన్ని చేపట్టి లాభాలను అందుకోవాలని సూచించారు. ఈ అంశాలు అటు రైతులను, ఇటు దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మారుస్తాయని పేర్కొన్నారు. నూతన సంవత్సరం తొలిరోజు ఆయన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 10వ విడత కింద రైతుల ఖాతాల్లోకి రూ.20,000 కోట్లు బదిలీ చేశారు. యూపీ, తమిళనాడు, గుజరాత్, త్రిపుర, రాజస్థాన్, హరియాణా తదితర రాష్ట్రాల్లోని వ్యవసాయ ఉత్పత్తి సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న రైతులనుద్దేశించి మాట్లాడారు.

“పిఎం కిసాన్ సమ్మాన్ నిధి భారతీయ చిన్న రైతులకు పెద్ద అండ. మధ్యవర్తులు, కమిషన్ల ప్రమేయం లేకుండా వేల కోట్ల రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఈ విడతతో ఇప్పటివరకు రైతుల ఖాతాల్లోకి రూ.1.80 లక్షల కోట్లకు పైగా బదిలీ అయింది. ఈ డబ్బు రైతుల రోజువారీ చిన్నచిన్న ఖర్చుల అవసరాలను తీర్చు తుంది. మంచి విత్తనాలు, ఎరువులు, ఉపకరణాలు ఉపయోగించగలుగుతున్నారు.

చిన్న రైతుల శక్తి సామర్థ్యాలను సంఘటితం చేయడంలో వ్యవసాయ ఉత్పత్తి సంఘాల పాత్ర పెద్దది. దానివల్ల అయిదు లాభాలున్నాయి. వారి బేరసారాల శక్తి పెరుగుతోంది. రైతులు ఒక్కొక్కరే వ్యవసాయం చేస్తే ఎరువులు, విత్తనాలు విడివిడిగా కొనాల్సి వస్తుంది. దీనివల్ల పెట్టుబడి పెరిగి లాభాలు తగ్గుతాయి. రైతులు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడడం వల్ల ఎరువులు, విత్తనాలు టోకున కొని, తమ వస్తువులను రిటైల్గా విక్రయించుకోగలుగు తున్నారు. కర్షకులు సంఘటితం కావడంవల్ల కొత్త ఆలోచనలు వస్తున్నాయి. కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయి. సవాళ్లను అధిగమించే శక్తి లభిస్తోంది. మార్కెట్ డిమాండ్‌ను అర్థం చేసుకొని అనువైన పంటలు పండించగలుగుతున్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తి సంఘాలను ప్రోత్సహిస్తోంది.

---

**పిఎం దక్ష్ యోజన**

వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, సఫాయి కార్మికులకు నైపుణ్యాభివృద్ధి పథకాలను అందుబాటులో ఉంచడానికి ఈ పోర్టల్‌ను ప్రభుత్వం లాంచ్ చేసింది. ఈ పథకాన్ని ఆగస్ట్ 8, 2021న ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పథకం వల్ల వెనుకబడిన వర్గాల యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల ప్రయోజనాలను మరింత సులభంగా పొందుతారు.

**అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ స్కీమ్**

జూలై 29, 2021న ఈ పథకాన్ని ప్రభుత్వం లాంచ్ చేసింది. ఈ స్కీమ్ ద్వారా ఒక ప్రోగ్రామ్ నుంచి మరొక ప్రోగ్రామ్‌కు క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ మెకానిజం పొందుతూ... దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థులు స్వేచ్ఛగా చదువుకునేలా అకడమిక్ మొబిలిటీ పొందవచ్చు. ఈ అకడమిక్ సర్వీసు మెకానిజం ద్వారా విద్యార్థుల అకడమిక్ క్రెడిట్లను స్టోర్ చేసి, ట్రాన్స్‌ఫర్ చేస్తుంటారు. కొత్త జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఈ ఏబీసీ స్కీమ్‌ను రూపొందించారు.

**పిఎం ఉమీద్ స్కీమ్**

ఏప్రిల్ 2021లో ఈ స్కీమ్‌ను లాంచ్ చేశారు. 2025-26 నాటికి 3 లక్షల మంది యువత వ్యాపారవేత్తలుగా మారేందుకు ఇది నైపుణ్యాల శిక్షణ ఇవ్వనుంది. పీఎం ఉమీద్ స్కీమ్ కింద యువతకు రుణాలు ఇవ్వడం, మార్కెట్ల యాక్సస్ కల్పించడం జరుగుతుంది. ■

స్నేహితుడికన్నా మిన్నగా ఒక్కొక్కసారి విరోధే విలువైన పాఠాలు నేర్పుతాడు

### అభివృద్ధిని ఆగనివ్వం

*కోవిడ్ పలు సవాళ్లను విసురుతున్నా దేశ అభివృద్ధిని మాత్రం ఆగనివ్వబోం. ప్రస్తుతం. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 8శాతానికి పైగా ఉంది. జీఎస్టీ రాబడిలో గత రికార్డులు బద్దలవుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు కొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. 50వేలకు పైగా అంకుర సంస్థలు పని చేస్తున్నాయి. పర్యావరణ మార్పులపై ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్నాం. 2070 నాటికి కర్బన ఉద్గారాలను పూర్తిగా తొలగించాలనే 'లక్ష్యం పెట్టుకున్నాం' అని మోదీ తెలిపారు.*

ఒక్కో సంఘానికి రూ. 15 లక్షల వరకు మద్దతు ఇస్తోంది. 2021లో రైతులు ఎన్నో రికార్డులు తిరగరాశారు. కరోనా మహమ్మారి భయపెట్టినా రికార్డు స్థాయిలో 300 మిలియన్ టన్నుల పంట దిగుబడులు సాధించగలిగారు. పండ్లు, కూరగాయల్లాంటి ఉద్యానవన పంటల ఉత్పత్తి 30 మిలియన్ టన్నులకు చేరింది. పాల ఉత్పత్తి 45% పెరిగింది. కనీస మద్దతు ధర కొనుగోళ్లు రికార్డుస్థాయిలో పెరిగాయి.

ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన ద్వారా 30 లక్షల హెక్టార్ల భూమికి సూక్ష్మ సేద్య సౌకర్యం కల్పించాం. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు 21,000 కోట్ల రూపాయలు ప్రీమియం కడితే వారికి రూ.లక్ష కోట్ల ప్రయోజనం కల్పించాం. లక్షల మంది పశుపోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేశాం. కొత్తగా ఆలోచించే సంకల్పం తీసుకోవాలి. కొత్త పంటలు, కొత్త విధానాలను చేపట్టడానికి తటపటా యించొద్దు" అని ప్రధాని పిలుపు నిచ్చారు. ■

---

# నేల, చెట్లు, పశువులు కలగలిసిన సేద్యమే మేలు !

*(5వ పేజీ తరువాయి....)*

వ్యవహరిస్తూ, అందులో వ్యావసాయిక అటవిని, పండ్లు, కూరగాయల తోటలను నిర్వహిస్తున్న తీరు గురించి ముందుగా వివరించారు.ఆగ్రో ఎకాలజీ గురించి ఆయన వివరిస్తూ, ప్రధానంగా చెట్లు, పంటపొలాలు పక్కపక్కనే కొనసాగే ఆగ్రో ఫారెస్ట్రీ విధానాన్ని అనుసరించడం ఎంతైనా అవసరమని చెప్పారు. సాంప్రదాయిక విత్తనాలను నాటడం ముఖ్యమని, అంటే హైబ్రీడ్ విత్తనాలో, జీవకణాల మెరుగుదల పేరుతో చెలామణి అయ్యే విత్తనాలో కాదని, వీటిని గురించి రైతులనే సంప్రతిస్తే మంచిదని అన్నారు. వ్యవసాయ భూములతో పశువుల అనుబంధాన్ని పెంచడంకూడా ఎంతైనా అవసరమని ఆయన అన్నారు.

తర్వాత శ్రీ రాజీవ్ అహల్ ప్రసంగిస్తూ, సాంప్రదాయిక, ఆధునిక వ్యవసాయాల మేలుకలయికగా సాగితేనే వాతావరణ మార్పులను తట్టుకుని నిలవగలిగే సాగు పద్ధతులు ఫలవంతమవుతాయని, కేవలం ఏ ఒక్క విధానం వల్లనో సత్ఫలితాలు సాధ్యంకావని అన్నారు. భూసారాన్ని పెంపొందించడానికి కేవలం పొలాల్లో చేసే కృషి మాత్రమే సరిపోదని, యిప్పటికే భూసారం బాగా క్షీణించిందని అన్నారు.

శ్రీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ఆగ్రో ఎకాలజీ అంటే ఏదో చిన్న విషయం కాదని భూమి, నీరు తో పాటు మొత్తం సమాజంతో ముడిపడిన బృహత్ విధానమని , అందువల్ల ఈ అంశాలనన్నిటిని పరిగణనలోకి తీసుకుని అనుసరించవలసిన సమగ్ర విధానం అవసరమని అన్నారు.

వీరి ప్రసంగాల మధ్యలో ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి, మెట్ట సేద్యం వ్యవహారాల నిపుణులు డాక్టర్ బండి వెంకటేశ్వర్లు , చివరిలో ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఈ చర్చాగోష్ఠిలో ఏపిమాస్ సిబ్బంది, ఏపిమాస్ మార్గదర్శక నిర్వహణలోని ఎఫ్ పి ఓల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ సి ఎస్ రెడ్డి ముగింపు ప్రసంగంతో ఈ చర్చాగోష్ఠి ముగిసింది.

■

# ప్రతికూల వాతావరణంతో నిరాశలో మామిడి రైతు

## అకాల వర్షాలు ... మబ్బులు...పొగమంచు ... పూతకు రాని తోటలు

**మా**మిడి సీజన్‌పై ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. తోటలు పూతకు వచ్చి పిందె కట్టే సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న అనూహ్య మార్పులు రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. డిసెంబరు ఆఖరు వారంలోనే పూర్తిస్థాయి పూతకు రావాల్సిన తోటలు ఇంతవరకు మొగ్గ కూడ కట్టకపోవడంతో దిగుబడిపై గుబులు పట్టుకుంది. చలి తీవ్రతలో హెచ్చు తగ్గులు, అకాల వర్షాలు, రోజుల తరబడి మబ్బులతో పాటు పొగమంచు (మూడం) కమ్ముకొని ఉండటం, చీడపీడల దాడి లాంటి పరిణామాలతో పూత వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. ఆలస్యంగా పూత వచ్చినా అది పిందె కట్టదని చెబుతున్నారు. రైతులు నవంబరు నుంచే వేల రూపాయల పెట్టుబడులు పెట్టి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. దున్నడం, ఎండు కొమ్మలు తొలగించడం, మందులు పిచికారి చేయడం, ఎరువులు వేయడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతికూల పరిస్థితులతో మామిడి రైతులు నిరాశలో మునిగి పోగా, ఈ పాటికే అడ్వాన్సుగా లక్షలు చెల్లించి తోటలు లీజుకు తీసుకున్న గుత్తేదారులు లబోదిబోమంటున్నారు.

జిల్లాలో 22 వేల ఎకరాల్లో సాగు మామిడికి మంచిర్యాల జిల్లా పెట్టింది పేరు. జిల్లాలో వరి, పత్తి తరువాత ప్రధాన పంట మామిడే. జిల్లాలో 22 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఎక్కువ శాతం నెన్నెల, జైపూర్, చెన్నూరు. తాండూర్, మందమర్రి, కోటపల్లి, బెల్లంపల్లి మండలాల్లోనే ఉన్నాయి. దేశంలో లభించే అన్ని రకాల మామిడి పండ్లు ఇక్కడ లభ్యమవుతాయి. ఇక్కడి మామిడి కాయలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. మామిడి పంటపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న వేలాదిమంది నిరాశలో ఉన్నారు. 5 ఏళ్లుగా నష్టాలే మామిడి రైతుల పరిస్థితి యేటేటా దిగజారి పోతోంది. ఒకప్పుడు మంచి దిగుబడితో ఆదాయం పొందిన రైతులకు ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అతివృష్టి, అనావృష్టి, గాలిదుమారాలు, వడగళ్ల వానలు, చీడపీడలు, తెగుళ్ల కారణంగా ఐదేళ్లుగా



మామిడి రైతులు వరుస నష్టాలను చవి చూస్తున్నారు.

ఈ ఏడు సైతం పంటవచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. ప్రతికూల వాతావరణం, చీడపీడల దాడి మామిడికి వాతా వరణం ప్రతికూలంగా ఉంది. చలితీవ్రత, రోజుల తరబడి మబ్బులు పట్టి ఉండటం, అకాల వర్షాలు లాంటి అంశాలు మామిడి పూతపై ప్రభావం చూపిస్తున్నాయి. మామిడి చెట్లు ఇప్పటికే పూర్తిస్థాయి పూతకు రావాల్సి ఉండగా.. ఈసారి ఆలస్యం అయ్యేలా ఉంది. ఫిబ్రవరి రెండో వారంలోగా పూతకు వచే అవకాశం ఉందని అధికారులంటున్నారు. దీనికి తోడు రోజుల తరబడి మబ్బులు పట్టి ఉండటంతో తెగుళ్లు, చీడపీడల ఉధృతి పెరిగిపోయింది. తోటల్లో తేనెమంచు, బూడిద తెగుళ్ల, రసంపీల్చే పురుగులు కనిపిస్తున్నాయి. ఆకుమచ్చ, పూతమాడు,

నల్లమచ్చ తెగుళ్ల ఉనికి ఉంది. బల్లిపాతర (బూజు) అధికంగా ఉందని రైతులంటున్నారు. ఈ తెగుళ్ల వల్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. పూత ఆలస్యంగా వచ్చినపుడు కాయ పెరుగుదల దశలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి పొడి వాతావరణం ఉంటుంది. రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశించి నష్ట పరిచే అవకాశం ఉంటుందని నిపుణులంటున్నారు.

**పూతకు రాని తోటల్లో ఇలా చేయాలి**

*– డాక్టర్ రాజేశ్వర్ నాయక్, సీనియర్ శాస్త్రవేత్త*

మామిడి పూత రావడం పలు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటికైనా తగు జాగ్రత్తలు పాటిస్తే పూత వచ్చే అవకాశం ఉంది. వచ్చిన పూతను సంరక్షించుకుని నష్టాలను పూడ్చుకోవచ్చు. ప్రస్తుత సమయంలో నీటి తడులను నిలిపివేసి తోటలకు బెట్ట పరిస్థితి కల్పించాలి. దీంతో శాకీయ పెరుగుదల నిలిచిపోయి మొక్కకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. దీనివల్ల చెట్టు పూత సమయానికి సరిపడ పిండి పదార్థం నిల్వ చేసుకోవడమే కాకుండా కొమ్మలు పూర్తి పక్వతకు చేరుకుని ఎక్కువ పూత రావడానికి దోహదపడతాయి.



పూమొగ్గలు రావడం ఆలస్యమైనప్పుడు లీటరు నీటిలో పది గ్రాముల మల్టీ-కే (పొటాషియం నైట్రేటు), 5 గ్రాముల యూరియా కలిపి చెట్ల కొమ్మలు బాగా తడిచేలాగా పిచికారి చేసుకోవాలి. పూత వచ్చే సమయంలో వాతావరణ పరిస్థితులు అధిక ప్రభావాన్ని చూపుతాయి. చలి తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా పూత వచ్చే అవకాశం ఉంటుంది. పగలు 18-28, రాత్రి 10-13 సెంటీగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలు నమోదైతే మెరుగైన ఫలితాలుంటాయి. పూమొగ్గ ఏర్పడిన తరువాత నీటితడులిచ్చి పైపాటుగా ఎరువులు వేసుకోవాలి.

చెట్టు వయసును బట్టి సాధారణంగా 500 గ్రాముల నుంచి ఒక కిలో యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ, బూడిద రంగు తెగులు, తేనెమంచు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. తెగులు ఉనికి గమనించిన వెంటనే లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక శాతం బోర్డు మిశ్రమం కలిపి స్ప్రే చేయాలి. పచ్చి పూత మీద ఒక గ్రాము కార్బండిజం, ఒక గ్రాము థయోఫినేట్ మిథైల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో లీటరు నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి స్ప్రే చేసుకోవాలి. బూడిద రంగు తెగులు మొగ్గ దశలో సోకితే మూడు గ్రాముల గంధకం, పూత దశలో కన్పిస్తే హెక్సాకోనోజోల్ ఒక మిల్లీలీటరు లేదా డైనోకాఫ్ ఒక మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తేనెమంచు తెగులు నివారణకు మొగ్గ, పూత దశలో ఒక మిల్లీ లీటరు డైక్లోరోవాస్ లేదా 3 గ్రాముల కార్బోరిల్ కలిపి చెట్టంతా తడిచేలా స్ప్రే చేయాలి.

పచ్చపూత దశలో కాండాలు వికసించ కుండా మొగ్గ దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి డైమిథోయేట్ లేదా 3 మిల్లీలీటర్ల మిథైల్ డెమటాన్ లేదా 0.25 శాతం మిల్లీ లీటర్ల ఇమిడా క్లోప్రిడ్ పిచికారి చేసుకుంటే ఆశించిన ఫలితాలు వస్తాయి. తోటల్లో ఎలాంటి సమస్యలున్న బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన శాస్త్రవేత్త స్రవంతిని సంప్రదిస్తే తగిన సూచనలు, సలహాలిస్తారు.

**పూత జాడే లేదు**

*– బెల్లం రాజిరెడ్డి, ఆవడం, నెన్నెల మండలం*

డిసెంబరు ఆఖరు కల్లా తోటలన్నీ పూతకు రావాలి. ఇప్పటికీ పూత జాడే లేదు. అంతంత మాత్రంగా వస్తున్న పూత మబ్బులు, పొగమంచుతో మాడి పోతోంది. చీడపీడలు కూడా ఎక్కువయ్యాయి. ఆలస్యంగా వచ్చే పూత పిందె కట్టుందనే నమ్మకం లేదు. తోటలో దుక్కి, ఎరువులు, పురుగు మందులకు పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదు. ■

**జీవితమంటే మంచి మనిషిని వెదికి పట్టుకోవడం కాదు, మంచి అనుబంధం ఏర్పరచుకోవడం**

# మామిడిని ఆశించే పురుగులు...సస్యరక్షణ మార్గాలు

*మామిడి పంటను తేనె మంచు, కాండం తొలిచే పురుగు, కాయ తొలిచే పురుగు, తామర పురుగు, పిండి పురుగు, ఆకు జల్లెడ పురుగు, టెంక పురుగు, పండు ఈగ వంటి పురుగులు;బూడిద తెగులు, మచ్చ తెగులు, మసి మంగు తెగులు, కొమ్మ ఎండు తెగులు, నల్ల మచ్చ తెగులు, తొడిమ కుళ్ళు తెగులు వంటి ఎన్నో పురుగులు, తెగుళ్ళు ఆశించి, పంటను నష్టపరుస్తాయి. ఈ పురుగులు, తెగుళ్ళనుంచి పంటను సంరక్షించుకోవడం ఎలానో తెలుసుకుందాం.*

• • • • • •

**తేనెమంచు పురుగు (మ్యాంగో హాఫర్స్):**

మామిడి పూత దశలో ఆశించే పురుగుల్లో తేనె మంచు పురుగులను ప్రత్యేకంగా చెప్పవచ్చు. వీటి వల్ల నష్టం ఎక్కువగా నవంబర్ నెల నుంచి మార్చి నెల ఆఖరు వరకు ఉంటుంది. ఈ పురుగులు ఆశించినప్పుడు పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుంది. ఇవి తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తాయి. ఈ జిగురు తినుటకు చీమలు మామిడి చెట్టుపై పాకుతూ కనిపిస్తాయి. మామిడి పూత రాలిపోవడానికి తేనె మంచు పురుగులు ముఖ్య కారణమని చెప్పవచ్చు. మామిడి చెట్లను మూడు రకాల తేనె మంచు పురుగులు ఆశించే అవకాశం ఉంది.



ఫిబ్రవరి - ఏప్రిల్ నెలల మధ్య ఆశించే తేనెమంచు పురుగులు లేత కొమ్మలు, చిగుళ్ళు. పూత నుంచి రసాన్ని పీల్చి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి. జూన్-ఆగస్ట్ నెలల మధ్య ఆశించే తేనె మంచు పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చి తమ మనుగడను సాగిస్తాయి. తేనె మంచు పురుగులు విసర్జించిన తియ్యటి జిగురు పదార్థంపై నల్లటి బూజులాంటి మసి తెగులు వృద్ధి చెంది, కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. కాయలపై కూడా మసితెగులు ఈ పురుగుల తాకిడి వల్ల ఏర్పడుతుంది. దీనివల్ల కాయల మార్కెట్ విలువ తగ్గిపోతుంది. తేనె మంచు పురుగుల ఉధృతి ఆంధ్రప్రదేశ్ వాతావరణ పరిస్థితుల్లో నవంబర్ నుంచి మార్చి నెలల మధ్యకాలంలో ఎక్కువగా ఉంటుంది.

**నివారణ:**

తోటలో నీళ్లు నిలువకుండా ఉంటే వీటి ఉధృతి తక్కువగా ఉంటుంది. లీటరు నీటికి లాంబా సిహలోత్రిన్ 5 ఇ.సి 1-1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 30 ఇ.సి 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 5 మి.లీ. కలిపి పూత మొదలయ్యే సమయం మరియు పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకులపైనే కాకుండా మొదళ్ళపైన, కొమ్మలపైన కూడా పిచికారీ చేయాలి. పూలు పూర్తిగా విచ్చుకోకముందే పిచికారీ చేయాలి. పూత బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయడం వలన పుప్పొడి రాలి పరాగ సంపర్కానికి తోడ్పడే కీటకాలు నశిస్తాయి. మొగ్గదశలో కనిపించిన ఎడల బ్యూప్రొఫెజిన్ 25 యస్.సి. (ఏ1-2.మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 25% డబ్ల్యు.జి 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8% ఎస్. ఎల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయుట వలన పురుగును సమర్ధవంతంగా నివారించవచ్చును. తేనె మంచు పురుగుల నివారణకు సస్యరక్షణ మందులు పిచికారీ చేసేటప్పుడు. ఆకులపైనే కాకుండా చెట్టు మొదలు వద్ద, కొమ్మలపైన కూడా పిచికారి చేయాలి. వీలైనంత వరకు పురుగు మందులను పూత ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారి చేయకూడదు.

**కాండం తొలిచే పురుగు:**

ఇవి ఆశించిన కొమ్మలే కాక ఒక్కసారిగా మొత్తం

చెట్టుకూడా ఎండిపోతుంది. పురుగుల విసర్జనాన్ని చూసిగాని, కొమ్మను తట్టినప్పుడు వచ్చే బోలు శబ్దాన్ని బట్టిగాని వీటి ఉనికిని గమనించవచ్చు. ఈ పురుగు తీవ్రంగా ఆశిస్తే మొక్కలు కూడా చనిపోతాయి.

**నివారణ:**

ఎక్కువ పాడైన కొమ్మలను తీసివేయాలి. గట్టి ఇనపతీగను లోపలికి చొప్పించి పురుగులను బయటికి లాగి చంపివేయాలి. తరువాత ఇమిడాక్లోప్రిడ్ 17.8% ఎస్.ఎల్ @ 1 మి.లీ/లీ లేదా డైయామిధోక్సామ్ 25% డబ్ల్యు జి @ 1గ్రా. /లీ నీటికి కలుపుకొని జులై నుండి 15రోజుల వ్యవధిలో 5 సార్లు స్ప్రే చేసుకోవాలి. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా హైడ్రాక్సైడ్ పేస్టును చెట్టు కాండానికి పూయాలి.

**కాయతొలుచు పురుగు:**

దీని ఉధృతి చిన్న కాయ దశ నుంచి పెద్ద కాయ దశ వరకు ఉంటుంది. కాయ ముక్కు భాగంలో నల్లటి రంధ్రంతో ఎండిన మామిడి కాయ / పిందెల గుత్తులు చెట్టుకు వ్రేలాడుట ప్రధానమైన లక్షణము, గోలీ సైజు కాయ దశలో ఒక్కొక్క గొంగళి పురుగు, ఒకటికన్నా ఎక్కువ కాయలకు నష్టము కలుగజేయును. సాధారణముగా ఒక్కొక్క మామిడి కాయ నందు 4-6 గొంగళి పురుగులు ఉండును. చిన్న సైజుకాయ లున్నప్పుడు, పురుగులు ఒక కాయ నుండి మరొక కాయకు మారి ఎక్కువ నష్టము కలిగించును. జనవరి, ఫిబ్రవరిల్లో తల్లి రెక్కల పురుగులు బయటకు వచ్చి పంటపై ఆశిస్తాయి.

**నివారణ**

- మామిడి పంట పూర్తి అయిన తరువాత ఎండు కొమ్మలను తీసివేసి నాశనం చేయాలి.
- మామిడి పంటకాలము పూర్తయిన తరువాత ఎండు కొమ్మలు / కాండము పగుళ్ళలో గల స్థబ స్థితిలో ఉన్న గళి పురుగులను నాశనం చేయాలి.
- మెత్తని ఎండు పుల్లలను కొమ్మ చుట్టూ గుత్తులుగా కట్టి నిద్రావస్థకు చేరిన గొంగళి పురుగులను ఒకేసారి నాశనం చేయవచ్చు. క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
- వేపగింజల కషాయం 5% లేదా వేపనూనె 1% (లీటరు నీటికి 10 మి.లీ.) పిచికారి చేసి ఈ పురుగులను అదుపులోకి తెచ్చుకోవచ్చు. డెల్టా మెథ్రిన్ 2.8 ఇన్ ఏ1 మి.లీ. లీటరు నీటికి కలిపి గోలీ సైజుకాయ దశలో రెండు వారాల కొకసారి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:**

మామిడి పూత, కాయల నుంచి రసాన్ని పీల్చి నష్టం కలుగజేసే పురుగుల్లో ముఖ్యమైనవి ఈ తామర పురుగులు. ఇవి 2 మి.మీ. పొడవుండి, కొత్త చిగురు వచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి గోకి రసాన్ని పీల్చి వేస్తాయి. దీని వలన లేత / చిగురు ఆకులు చిన్నవిగా ఉండి ఆ తరువాత రాలిపోతాయి. ఈ పురుగులు పుష్పగుచ్ఛాలపై, పిందెలపై చర్మం గీకి రసం పీల్చడం వల్ల వక్క రంగులో చర్మం బీటలు వారి రాతి మంగు ఏర్పడి, కాయ నాణ్యత పడిపోతుంది.

**నివారణ:**

ఈ పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 5 ఎస్.సి 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 30 ఇసి 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి నల్ల పూత దశలో అనగా పిందెలు ఎదిగే దశలో పిచికారి చేయాలి.

**పిండిపురుగు:**

మామిడి పిందె లేదా కాయలపై, కాడలపై తెల్లని పిండి వంటి పదార్థపు కవచం కలిగిన చిన్న పురుగులు ఆశించి తీవ్రమైన నష్టం కలుగజేస్తాయి. ఈ దూదిలాంటి కవచాల క్రింద ఉండే పురుగులు గుంపులు గుంపులుగా చేరి పిందె/ కాయల నుంచి రసాన్ని పీలుస్తాయి. భూమిలో గ్రుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చిన పిల్ల పురుగులు మొక్క కాండం పైకి ఎగబాకి మొక్క ఇతర భాగాలను చేరి సమూహాలుగా పెరుగుతాయి. తల్లి పురుగులు పిందె/కాయల నుంచి, వాటి కాడల నుంచి రసం పీల్చడం వల్ల వాటి పెరుగుదల తగ్గిపోవడం లేదా కాయ రాలిపోవడం జరుగుతుంది. ఇది వదిలే జిగట పదార్థం వల్ల కూడా పిందె, కాయలపై మసి

తెగులు వ్యాపిస్తుంది. ఈ పురుగు ఎక్కువగా ఆకులు, కొమ్మలు, పూత కాడల సందుల్లో ఆశించి నష్టపరుస్తుంది. వీటి తీవ్రత ఫిబ్రవరి–మార్చి నెలల్లో అధికంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా ఆశిస్తే కాయలు సరిగా ఎదగక రాలిపోతాయి.

**నివారణ:**

- వీటి నివారణకు తొలకరిలో చెట్టు మొదలు దాకా దగ్గరగా దున్నాలి లేదా పాదులను త్రవ్వి తిరగేయాలి.
- చెట్టుకి మీటరు ఎత్తులో పాలిథీన్ షీట్స్ కట్టడం, గ్రీజు పూయడం ద్వారా పురుగులు చెట్టు పైకి పాకకుండా నివారించవచ్చు.
- వేసవిలో చెట్ల క్రింద తవ్వి మట్టిని వెలికితీయాలి. 1.5గ్రా. ఎసిఫేట్ 75% ఎస్.పి లేదా 2 మి.లీ. క్వినాల్ఫాస్ 25 ఇసి లీటరు నీటికి కలిపి చెట్ల భాగాలను బాగా తడిచేలా పిచికారీ చేయాలి.
- కార్బోసల్ఫాన్ 25 ఇ.సి 2 మి.లీ./లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ./లీ. నీటికి పిల్ల పురుగులను నాశనం చేయడానికి వాడవచ్చును.

**ఆకు జల్లెడ గూడు పురుగు:**

ఆగష్టు–సెప్టెంబరు మాసాల్లో ఈ గొంగళి పురుగులు లేత ఆకులను గూడుగా చేసుకొని లోపల ఆకులను గోకి తింటాయి. చివరగా ఆకుల ఈనెలు మాత్రమే మిగిలి వాడి రాలిపోతాయి. దీని వల్ల పూగుత్తులు ఏర్పడవు. ఈ పురుగు పూత దశలో పూతను, పూమొగ్గలను ఆశించి తర్వాత పూగుత్తులను గూడుగా ఏర్పరుస్తుంది.

**నివారణ:**

క్వినాల్ఫాస్ 25 ఇసి 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 36 ఎస్.ఎల్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి జూలై–ఆగష్టు నెలల్లో పిచికారి చేయాలి. తోటలను బాగా దున్నాలి.

**టెంకపురుగులు:**

ఈ పురుగు ముఖ్యంగా నీలం, తోతాపురి రకాల్ని ఆశించి, ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. తల్లి పెంకు పురుగులు మామిడి కాయలు గోళీ కాయ సైజులో ఉన్నప్పుడు కాయల మీద గ్రుడ్లు పెడతాయి. గ్రుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు కాయలోకి తొలుచుకొనిపోయి టెంకను చేరి, టెంకలోని గింజను తిని పెరిగి కోశస్థ దశను కూడా అక్కడే పూర్తి చేసుకొని కాయకు రంధ్రం చేసి బయటకు వస్తుంది.

**నివారణ:**

- అసిఫేట్ 75 ఎస్.పి 1 గ్రా. లీటరు నీటిలో కలిపి పిందె ఏర్పడిన తర్వాత ఒకసారి, నెల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి.
- దీనివల్ల గ్రుడ్లు, వాటి నుండి వచ్చే పిల్లలు చనిపోతాయి.
- డైమిథోయేట్ 30ఇసి 2మి.లీ.కాయ గోళీ పరిమాణంలో ఉన్నప్పుడు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

**పండు ఈగ:**

మామిడి కాయలను పక్వానికి వచ్చిన తర్వాత ఆలస్యంగా కోత కోసినట్లయితే పండు ఈగ ఆశించి తీవ్రమైన నష్టం కలుగుతుంది. ఈ పురుగు యొక్క తల్లి ఈగలు ఎరుపు, గోధుమ రంగులో కలిసిన శరీరంతో పసుపు పచ్చని చారలు కలిగి ఉండి, ఒకే జత రెక్కలతో తోటలో ఆకుల అడుగు భాగంలో ఎగురుతూ ఉంటాయి. ఇవి తిరిగి తల్లి ఈగలుగా మారి తమ జీవిత చక్రాన్ని కొనసాగిస్తాయి. ఈ ఈగల తాకిడి జూన్–జూలై మాసాల్లో అధికంగా ఉంటుంది. మామిడి తోటల మధ్యకాని, చుట్టూ గాని జామ, బొప్పాయి తోటలు ఉన్నట్లయితే వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పండు ఈగ పిల్ల పురుగులు గుజ్జును తిని పండ్లను కుళ్ళిపోయి రాలిపోయేలా చేస్తాయి. ఈ పురుగు ఆశించటంవల్ల కాయలు తినటానికి గాని, గుజ్జు/రసం తీయడానికి గాని పనికిరాక ఎగుమతులకు కూడా ఉపయోగపడకుండా పోతాయి.

**నివారణ:**

రాలిపోయిన పండ్లను ఏరి నాశనము చేయాలి. చెట్టు క్రింద దున్ని కోశస్థ దశను బయట పడేయాలి. ప్లాస్టిక్ పళ్ళెంలో మిథైల్ యూజినాల్ 2 మి.లీ. మరియు 2 మి.లీ. మలాథియాన్ 50 ఇసి ను ఒక లీటరు నీటిలో కలిపి తోటలో వేలాడగట్టాలి. 2 మి.లీ. మలాథియాన్ 50 ఇ.సిను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మార్కెట్లో

లభ్యమయ్యే పండు ఈగను ఆకర్షించే బుట్టలను ఎకరాకు 5 చొప్పున 5-6 అడుగుల ఎత్తులో కొమ్మలకు కట్టాలి.

**తెగుళ్ళు**

**బూడిద తెగులు:**

ఈ తెగులు మన రాష్ట్రంలో అన్ని రకాలపై ఆశించి అధిక నష్టం కలిగిస్తుంది. ఈ తెగులు ఆశించడం వల్ల మామిడి పూతపై, రెమ్మలపై, పిందెలపై బూడిద రంగు బూజు ఏర్పడుతుంది. తెగులు ఆశించిన పూత, లేత కాయలు రాలిపోతాయి. తెగుళ్ళు తీవ్రంగా ఉండే దశలో పూత మాడిపోయి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. నివారణ: ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపినేట్ 2గ్రా./లీ లేదా ట్రైడిమార్ఫ్ 1 మి.లీ. లేదా ట్రైడిమేఫాన్ 1 గ్రా. లేదా మైక్లాబ్యుటానిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 15-20 రోజుల వ్యవధిలో మందులు మార్చి పిచికారీ చేయాలి.

**మచ్చతెగులు :**

మామిడిని ఆశించే తెగుళ్ళలో ఇది అతి ముఖ్యమైనది. ఈ తెగులు ఆకులు, కొమ్మలు, పూరెమ్మలు, పూలు, పండ్లపైన ఆశిస్తుంది. ఆకులపై మచ్చలు ముదురు గోధుమ రంగులో మధ్యస్థంగా ఉండి గులాబి రంగులో ఉంటాయి. ఈ మచ్చలు తరువాత ఎండిపోయి ఆకులు రాలిపోతాయి. పూరెమ్మలపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. పిందెలపై కూడా నల్ల మచ్చలు ఏర్పడడం వలన పిందెలు రాలిపోతాయి. ఈ తెగులు నిల్వలో, రవాణా చేసేటప్పుడు ఇతర కాయలకు వ్యాపిస్తుంది.

**నివారణ:**

ఎండుకొమ్మలను తీసివేసి లీటరు నీటికి హెక్సాకొనజోల్ (5 ఇసి) 2. మి.లీ (లేదా) క్లోరోథలోనిల్ 2గ్రా. కలిపి సమయంలో 15 రోజుల వ్యవధిలో మందులను మార్చుతూ రెండుసార్లు పిచికారీ చేయాలి.

**మసి మంగు (సూటీ మోల్డ్):**

ఈ తెగులు కాప్నోడియం అనే శిలీంధ్రం ద్వారా వస్తుంది. ఈ తెగులు తేనె మంచు పురుగు, పిండినల్లి లాంటి రసం పీల్చే పురుగు విసర్జించే తేనె లాంటి జిగురు పదార్థం మీద వృద్ధి చెందుతుంది. ఈ తెగులు వలన ఆకులపైన మసిపూసినట్లుగా నల్లటి పొర ఏర్పడుతుంది. ఆకులపై ఏర్పడిన మసి వలన కిరణజన్యసంయోగ క్రియ జరుగదు. తద్వారా కాయ ఎదుగుదల, దిగుబడి క్షీణిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా గుబురుగా ఉన్న చెట్లలో వ్యాప్తి చెందుతుంది.

**నివారణ :**

రసం పీల్చే పురుగులను సమర్ధవంతముగా అరికట్టాలి. దీని నివారణకు 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజమ్ మాంకోజెబ్ 2గ్రా./లీ చెట్ల ఆకులు, కొమ్మలు, రెమ్మలు తడిచేటట్లు పిచికారి చేయాలి. రసం పీల్చే పురుగులను అదుపు చేయడానికి పూత సమయంలో 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఆకులపై మసిని తొలగించుటకు 2 కిలోల గంజి పొడిని గోరువెచ్చని నీటిలో 3-4 లీ॥) కలిపి ఉడికించి, తరువాత మిగతా నీరుపోసి 100 లీటర్ల గంజి ద్రావణం తయారుచేసి తెగులు కనిపించిన భాగాలపై ఎండ బాగా ఉన్న రోజుల్లో పిచికారి చేయాలి. 4-5 రోజుల తరువాత నీటిని పిచికారి చేస్తే చాలావరకు మసి మంగు తొలగించబడుతుంది.

**కొమ్మ ఎండు తెగులు:**

ఈ తెగులు ఆశించినప్పుడు చెట్టులోని కొన్ని కొమ్మలు పై నుండి క్రిందికి ఎండుతాయి. కొమ్మలోని ఆకులు వాడినట్లుగా కనబడి ఎండిపోతాయి. ఎండిన కొమ్మ బెరడు రంగు మారి పెద్దవైన చారలు ఏర్పడతాయి. ఈ తెగులు ఎక్కువగా వేసవి కాలంలో కనిపిస్తుంది.

**నివారణ:**

తెగులు నివారణకు 1 గ్రా. కార్బెండజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బాక్టీరియా నల్లమచ్చ తెగులు:**

ఈ తెగులు ముఖ్యంగా కోస్తా ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. నల్లని మచ్చలు ముదురు ఆకులపై ఏర్పడి తెగులు ఆశించిన ఆకులు త్వరగా రాలిపోతాయి. ఈ తెగులు ఆశించిన తోటల్లో పచ్చి ఆకు రాలటం అధికంగా ఉంటుంది. ఈ తెగులు కాయలను ఆశిస్తే కాయలపై చిన్న

పగుళ్లు ఏర్పడి జిగురులాంటి పదార్థం కారుతుంది.

**నివారణ:**

ఈ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 300 గ్రా.కు స్ట్రెప్టోసైక్లిన్ 60గ్రా. లేదా అగ్రిమైసిన్ 60గ్రా. 100 లీటర్ల నీటిలో కలిపి తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

**మామిడి తొడిమ కుళ్ళు:**

ఈ తెగులు ముఖ్యంగా బెంగుళూరు (తోతపురి) రకానికి ఎక్కువగా ఆశిస్తోంది. కాయలు తయారు అయి పక్వ దశలో చెట్టుపైన కాయ తొడిమ దగ్గర కాయపై భాగంలో నల్లని వలయాకారపు మచ్చలు ఏర్పడి కాయలు కాలిపోవడం జరుగుతుంది. ఇందుకు గాను 45 రోజుల కోతకు ముందు 'థమోఫనేట్ మిథైల్' 1 గ్రా.ఒక లీటరు నీటికి (లేదా) టేబుకోనజోల్ (50%), ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ (25% డబ్ల్యుజి) 1 గ్రా. పిచికారీ చేసుకోవాలి.

**కోయటం , నిల్వ చేయటం:**

మామిడి కాయల్ని నవీన పరికరాల (హార్వెస్టర్ల) ను ఉపయోగించి కోస్తే కాయలకు ఏ విధమైన హాని కలుగకుండా తొడిమలతో సహా కోయవచ్చు. జీడి లేక సొన కారకుండా వుండి కాయలు ఎక్కువ రోజులు నిల్వ వుండి మార్కెట్లో ధర కూడా అధికంగా ఉంటుంది. మామిడి కాయల్ని కోసే కొన్ని పరికరాలు – ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ రీసెర్చ్, బెంగుళూరు వారు రూపొందించిన ఐ.ఐ. హెచ్.ఆర్. పరికరం, భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ, న్యూఢిల్లీ వారు రూపొందించిన ఐ.ఎ.ఆర్.ఐ.పరికరం, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ ఫర్ నార్తన్ ప్లెయిన్స్, లక్నో (యు.పి.) వారు రూపొందించిన సి.ఐ. హెచ్.ఎన్.పి. పరికరం మరియు కొంకణ్ కృషి విద్యాపీఠ్, డాపోలీ వారు రూపొందించిన డాపోలీ పరికరం. ఈ డాపోలీ పరికరం సహాయంతో కాయల తొడిమను పరికరం కత్తెరల మధ్య వుంచి లాగి నప్పుడు స్ప్రింగువల్ల కత్తెరలు దగ్గరగా వచ్చి తొడిమను కత్తిరిస్తాయి. కాయలు చట్రానికి అమర్చిన వలలో పడతాయి. పాటుకాయ రాలితే తెంపడానికి సిద్ధంగా ఉన్నదని అనుకోవాలి. కాయతొడిమకు ఇరువైపుల పాలిపోయిన/ లేత పసుపుపచ్చ రంగురావడం, కాయ ఉపరిభాగాన నూనె గ్రంధులు ఏర్పడటం అనేది కోతకు సరియైనదశ. బంగినపల్లిలో టి.ఎస్.ఎస్. 9.0, దశేరిలో 8.5 వరకు పెరిగినప్పుడు తెంపితే పండు నాణ్యత దెబ్బతినదు. సంచులు తగిలించిన గడలతో కాయల్ని తెంపి, కిందికి చేరవేయాలి. జీడి వీలైనంత వరకు అంటకుండా కాయను కొంతసేపటి వరకు బోర్లించి కారనియ్యాలి. కాయలను వరుసలుగా గడ్డిలో పేర్చి మండెవేస్తారు. పూర్తిగా పండే వరకు మండెలను కదల్చరాదు. కాయలు కోసేటపుడు కాయకు ఒక అంగుళం తొడిమ ఉండేటట్లు డాపోలి హార్వెస్టరును ఉపయోగించి కోసుకోవాలి.

కాయలను 6 శాతం మైనపు ద్రావణంలో ముంచి తీయడంవల్ల 2–4 రోజులు ఆలస్యంగా పండుతాయి. పండుతున్నప్పుడు బరువును ఎక్కువగా నష్టపోవు, రోగాలను కూడా అరికడుతుంది. మామిడి కాయలను 100 పిపియమ్ మోతాదులో ఇథిలిన్ గ్యాస్ ద్వారా 20 – 25 సెం.గ్రే. మరియు 85–90 తేమ శాతం వద్ద 18–24 గంటలు రైపెనింగ్ గదులలో ఉంచి మగ్గ బెట్టుకోవలెను (లేదా) 2 మి.లీ. ఇథెఫాన్ ద్రావణంలో 0.5 గ్రా సోడియం హైడ్రాక్సైడ్ వేసిన యెడల ఇథిలిన్ గ్యాస్ ఉత్పత్తి అయి, దీనిని కృత్రిమంగా తయారు చేసిన పాలి షీట్ గదులలో ఉంచి మగ్గ బెట్టుకోవలెను.

**నిలకడగా కాపు కాయుటకు చర్యలు:**

కాయలు కోసేటప్పుడు తొడిమెలతోసహా కోయాలి. కోత పూర్తైన తరువాత ఎండుకొమ్మలను మరియు అడ్డదిడ్డంగా పెరిగే కొమ్మలను తీసివేయాలి. చెట్టు చుట్టూ లోతుగా దున్ని, ఎరువులను వేసి వెంటనే నీరుకట్టాలి. జూలై–ఆగష్టు మాసాల్లో మరియు అక్టోబరు మాసంలో లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్, 10 గ్రా. యూరియా కలిపి పిచికారి చేయాలి. మామిడి సాగుపై మరిన్ని వివరాలకు కడప జిల్లా అనంతరాజుపేట, కృష్ణాజిల్లా నూజివీడులలోని ఉద్యాన పరిశోధనా స్థానాలను సంప్రతించాలి. ■

# పూత నిలవక, పిందె రాక 'కంది'పోతున్న రైతు!

నల్ల తామర పురుగుతో మిరపలో పూత నిలవక రైతులు భారీ ఎత్తున నష్టపోగా, ఇప్పుడు కంది పంటను నల్లి వెంటాడుతోంది. దీని కారణంగా వచ్చే వెర్రి (ఎస్.ఎం.డి– స్టెరిలిటీ మొజాయిడ్ డిసీజ్) తెగులుతో కంది దిగుబడులు భారీగా పడిపోనున్నాయి. పూత నిలవడం లేదు. పిందె కావడం లేదు. అధిక శాతం పొలాల్లో ఎకరాకు ఐదు, పది కిలోల



దిగుబడి కష్టమే అని రైతులు వాపోతున్నారు. ప్రకాశం, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో తెగులు ప్రభావం అధికంగా ఉంది. ఈ తెగులు సోకితే పంట దిగుబడి పూర్తిగా పోయినట్లే అనే అభిప్రాయం శాస్త్రవేత్తల్లోనూ వ్యక్తమవు తోంది. రైతులు ఎన్ని మందులు పిచికారీ చేసినా తగులు అదుపులోకి రావడం లేదు. అక్టోబరు, నవంబరులో కురిసిన భారీ వర్షాలతో

*రాష్ట్రంలో కంది సాగు (ఎకరాల్లో) 6.14 లక్షలు*
*దెబ్బతిన్న విస్తీర్ణం (అంచనా) 4.60 లక్షలు*
*రైతుకు నష్టం రూ. 1,104 కోట్లు*
*(ఎకరాకు రూ.24 వేల చొప్పున)*

పలుచోట్ల నీరు నిలిచి కంది పైరు కొంత దెబ్బతినగా, పూత రాలి మరికొంత నష్టం జరిగింది. తాజాగా నల్లి నలివేస్తోంది. ఎకరాకు రూ. 10వేల చొప్పున కౌలు, పెట్టుబడిగా 10 వేల రూపాయలు కలిపి 20వేల రూపాయలు నష్టపోనున్నారు. మొత్తంగా చూస్తే 1,104 కోట్ల రూపాయలు మేర రైతులు కౌలు, పెట్టుబడి రూపంలో కోల్పోనున్నారు.

**అనంతపురం జిల్లాలో 32% అధికం**

రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ లో 6.14 లక్షల ఎకరాల్లో కంది వేశారు. గతేడాది కంటే సాగు 56 వేల ఎకరాలు పెరిగింది. రాష్ట్రంలోనే అధికంగా ప్రకాశం జిల్లాలో కంది సాగు చేస్తారు. తర్వాత స్థానంలో కర్నూలు నిలుస్తుంది.

*ప్రకాశం జిల్లా పొదిలి మండలంలో 21 వేల ఎకరాల్లో కంది సాగు చేస్తే అధికశాతం వెర్రితెగులు కారణంగా దెబ్బతింది. ఎన్ని మందులు చల్లినా పూత, పిందె నిలవడం లేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.*

*గుంటూరు జిల్లా శావల్యాపురం గ్రామానికి చెందిన హరిబాబు మూడున్నర ఎకరాల్లో కంది వేస్తే.. పెట్టుబడి రూ.40 వేలు అయింది. ఇప్పటివరకు పూత నిలవలేదు. కాపు వస్తుందనే ఆశ పోయింది. మొక్కకు ఐదు, పది కాయలు నిలిచినా.. కోత ఖర్చులకూ రావు' అని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.*

అయితే ఈ ఏడాది అక్కడ సాధారణ విస్తీర్ణం కంటే సాగు తగ్గింది. అనంతపురం జిల్లాలో గణనీయంగా పెరిగింది. గతేడాది 1.18 లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాది 1.83 లక్షల ఎకరాలకు పెరిగింది. ఇది సాధారణ విస్తీర్ణం కంటే 32% అధికం. గతేడాది దిగుబడులు బాగుండటంతో వేరుసెనగ నుంచి కందికి మళ్లారు.

**75% పైనే నష్టం**

భారీవర్షాలు, వెర్రి తెగులు కారణంగా రాష్ట్రంలో సాగు చేసిన మొత్తం కంది విస్తీర్ణంలో 75% పైనే దెబ్బతింటుందని అంచనా. కంది సాగుకు ఎకరాకు 10 వేల రూపాయలు నుంచి 12 వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. కౌలు రూపంలో 10 వేల రూపాయలు వరకు చెల్లించాలి. ఈ ఏడాది తెగులుకు మందులు అధికంగా చల్లాల్సి రావడంతో 2 వేల రూపాయలు పెట్టుబడి పెరుగుతోంది. మొత్తంగా చూస్తే రూ.21 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ■

# తప్పు చేసేది ఎవరైనా ... శిక్ష రైతుకే !

**ఈ**సారి ధాన్యం మద్దతు ధర రాకపోగా.. రైతులకు అదనంగా చేతి చమురు వదులుతోంది. హమాలీ కూలీలు, రవాణా చార్జీలు వంటివన్నీ రైతు పైనే భారం మోపుతున్నారు. ధాన్యం సేకరణ ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇంతవరకు ఒక్క రైతుకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. హమాలీలు దినసరి వేతనంతో జీవించేవారు. ఒక్కరోజు కూలీ ఆపినా వారి ఇళ్ళు గడవని పరిస్థితి. దీంతో హమాలీలకు అప్పోసప్పో చేసి రైతులు చెల్లిస్తున్నారు. రవాణా ఛార్జీలు రైతులే చెల్లిస్తున్నారు. సొంత ట్రాక్టర్ ఉంటే డీజిల్ కోసం డ్రైవర్ కోసం అప్పులు చేస్తున్నారు. హమాలీలకు, రవాణా చార్జీలు ఇంతవరకు ఒక్క పైసా రాలేదు. ధాన్యం సేకరణ గందరగోళంగా సాగుతోంది. దీంతో హమాలీ చార్జీలు తమకు వస్తాయో రావోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**హమాలీల ఖర్చు సొసైటీల ఖాతాలో ...**

ధాన్యం సేకరణకు నిధుల సమస్య రావడంతో ప్రాథమికంగా రైతులకు హమాలీల చార్జీలు చెల్లించాలని వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి హమాలీల ఛార్జీలను పౌరసరఫరాల సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. ధాన్యం సేకరణ సొమ్ములు చెల్లించేందుకు రైతులకు కనీస గడువు 23 రోజులు విధించారు. అదీ ధాన్యం విక్రయించిన నాటి నుంచి కాకుండా.. ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) జారీ చేసిన నాటి నుంచి గడువు పెట్టారు. ఓ రైతు ధాన్యం విక్రయించిన తర్వాత ఆరేబీకేలో డేటా ఎంట్రీకి కనీసం వారం పదిహేను రోజులు పడుతుంది. సాంకేతిక సమస్యలు ఉంటే అసలు నమోదు కావడం లేదు.

కంచనపల్లి శంకరరావు అనే రైతు ఎంటీయూ 1061 సాగు చేసి మిల్లరుకు విక్రయించారు. శేరినర్సన్నపాలెం ఆర్‌బీకే లో నమోదు కావాలి. కానీ ఈ సీజన్‌లో స్వర్ణ సాగు చేసినట్లు ఉండటంతో ఆయనకు ఇంతవరకు నమోదు చేయలేదు. దీంతో మిల్లరుకే రూ.1200 చొప్పున బస్తా విక్రయించారు. తీరిగ్గా తర్వాత మిల్లరు నమోదు చేయించుకుని ఎంఎస్‌పీ, హమాలీ, రవాణా ఛార్జీలు అన్నీ తన ఖాతాలో వేసుకునే అవకాశం వుంటుంది. కొన్ని పీఏసీఎస్‌లు తాము చెల్లించబోమని ధిక్కార స్వరం వినిపిస్తే ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని కార్యదర్శులు చెబుతున్నారు. గత ఏడాది ధాన్యం సేకణలో పీఏసీఎస్‌లకు క్వింటాకు రూ. 32 రూపాయల చొప్పున కమిషన్ ఇచ్చామని ఆ నిధులు ఏమయ్యాయని అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నందిగామ మండలంలో పర్యటించిన కలెక్టర్ హమాలీల చార్జీలు చెల్లించలేదని మాగల్లు సొసైటీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

*__బా__పులపాడు మండలం కె. సీతారాంపురం గ్రామానికి చెందిన రైతు రెండు ఎకరాలు వరి సాగు చేశారు. 70 బస్తాలు దిగుబడి వచ్చింది. కానుమోలులో మిల్లరుతో మాట్లాడి తోలారు. తేమ శాతం ఎక్కువగా ఉందని బస్తాకు 200 రూపాయలు ఇచ్చేవిధంగా ఒప్పందం చేసుకున్నారు. హమాలీ కూలీలు, రవాణా ఖర్చులు అన్నీ రైతే భరించారు. ఇదే ధాన్యం కానుమోలు ఆర్‌బీకేలో రైతు విక్రయించినట్లు నమోదు చేశారు. ఈ రైతుకు హమాలీ, రవాణా ఛార్జీలు రాలేదు. రవాణా ఛార్జీలపై ఇంకా స్పష్టత లేదు. ఎంత ఇస్తారో తెలియని పరిస్థితి.*

కృష్ణా జిల్లాలో ఇప్పటికే 2,30 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు లెక్కలు చెబుతున్నాయి. క్వింటాకు 25 రూపాయల చొప్పున హమాలీ కూలీ చెల్లించాల్సి ఉంది. ఇవన్నీ రైతులే ఇప్పటివరకు భరించారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు రూ. 6 కోట్లకు పైగా హమాలీ కూలీల సొమ్ము రైతులు భరించారు. వారికి ఇవి చెల్లించాల్సి ఉంది. ■

వెనుక చింతించడం కంటె ముందు జాగ్రత్తపడడం మంచిది

# అకాల వర్షాలవల్ల తెగుళ్ళతో శనగ రైతు గుల్ల

ప్రకృతి వైపరీత్యాలు రైతును దెబ్బ మీద దెబ్బ తీస్తున్నాయి. ఈ ఏడాది అతి వృష్టితో కకావికలమవుతున్న రైతుకు మరో కష్టం వచ్చి పడింది. ఈ ఏడాది రబీలో సాగు చేసిన శనగ పంటకు ఎండుతెగులు సోకడంతో పంట నిలువునా ఎండిపోతోంది. మళ్లీ సాగు చేద్దామన్నా పైరు వేసేందుకు అదును దాటి పోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు అల్లాడిపోతున్నారు. మండలంలో రబీ సీజన్‌కు ప్రధానమైన పంట శనగ. ప్రస్తుత సీజన్‌కు సుమారు 12 వేల ఎకరాల్లో సాగువుతోంది. పది రోజుల క్రితం విత్తనం మొదలు రెండు నెలలు దాటిన శనగ పంటలు సాగులో ఉన్నాయి. మండలంలోని తూర్పు గ్రామాల పొలాలు ఆరక శనగ విత్తడంలో జాప్యం జరిగింది. ఆలస్యంగా శనగ ఎద పెట్టడం ప్రారంభమైనా ఇంతలో మళ్లీ సంక్రాంతికి ఎడతెరపి లేని వర్షాలు కురవడంతో కొన్ని తోటల్లో శనగ విత్తడం మరింత ఆలస్యం అయింది.

పడమర గ్రామాలైన కొణిజేడు, పొందూరు, ఎం నిడమలూరు, కారుమంచి లాంటి కొన్ని గ్రామాల్లో శనగ వేసి రెండు నెలలు గడుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో తూర్పు గ్రామాల్లో శనగ సాగు జాప్యం జరిగినా పడమర ప్రాంతంలో అదునుకు పంటలు సాగు కావడంతో ఆయా గ్రామాల రైతులు ఆనందపడ్డారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు తూర్పుతీర గ్రామాల్లో భారీ వర్షాలు పడగా పడమర గ్రామాల్లో తక్కువగానే పడ్డాయి. పంటల పెరుగుదలకు సరిపడా వరం పడినందునే రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తోటలకు నీరు కట్టి అవసరం కూడా తప్పిందని అంతా ఆశించారు.

**నిలువునా ఎండిపోతున్న శనగ పంట**

శనగ పంటలను ఎండు తెగులు ఆశించడంతో శనగ వేరు ఎండిపోయి వేలు నిలువునా ఎండిపోతున్నాయి. ప్రధానంగా రెండు నెలల కాలం దాటిన తోటల్లో ఈ సమస్య కనిపిస్తోంది. ముందు చేలలో అక్కడక్కడా కనిపించిన ఎండు మొక్కలు ఇప్పుడు పొలమంతా విస్తరిస్తున్నాయి. ఈ ఇబ్బందులు గతంలోనూ ఉన్నా ఈసారి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. 60 రోజులు పంట కాలం గడవగానే ఈ సమస్య ఎక్కువగా వస్తోంది.

ప్రస్తుతం పొందూరు, కొణిజేడు, ఏం నిడమలూరు గ్రామాల్లో శనగ చేలు ఎండు తెగులు దెబ్బకు ఎండిపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. వ్యవసాయాధికారులు సైతం చేతులెత్తేయడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పొందూరులో మేరుగ ఆనంద్, పరమయ్య మరికొంతమంది రైతులు ఇప్పటికీ ఎండిపోయిన శనగ పంటను దున్ని వేశారు. కొణిజేడు రైతులు కొందరు కొన్నాళ్ల క్రితమే ఎండిన పంటలను తీసి వేశారు. ఇంకొందరు రైతులు ఎండిన శనగ పంటను తీసివేసేందుకు సిద్ధమవు తున్నారు. పంట కాలం గడిచేకొద్దీ ఎండు తెగులు సమస్య ఎక్కువవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూమిలో సేంద్రియ కర్బనం లేకనే...**

భూమిలో సాధారణంగా ఉండే సేంద్రియ కర్బనం లేక సిలీంద్రాలు (బ్యాక్టీరియా) ఉత్పన్నమై శనగ పంటను ఎండు తెగులు ఆశిస్తున్నదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశువుల పేడ ఇతర దిబ్బల్లోని ఎరువులను వాడకపోవడం, సేంద్రియ ఎరువుల స్థానంలో రసాయనిక ఎరువుల వాడకం పెరగడం, అలాగే పంట మార్పిడి చేయక పోవడం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగించకపోవడం లాంటి కొన్ని పరిస్థితుల వలన పంటలను వివిధ తెగుళ్లు ఆశిస్తున్నట్లు వ్యవసాయ సిబ్బంది తెలియజేస్తున్నారు.

ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసి పొలంలో ఎద పెట్టాలని చెప్పినా కొందరు రైతులు అంతగా పట్టించు కోలేదని చెబుతున్నారు. పంట సాగుకు అదును దాటి పోవడంతో తీసివేస్తున్న శనగ స్థానంలో ఏమి సాగు చేయాలా అని రైతులు అయోమయంలో పడ్డారు. ■

# యువత తలిస్తే వ్యవసాయానికి భవిత

**యు**వత తలచుకుంటే వ్యవసాయానికి భవిత ఉంటుంది. 'సేంద్రియ సాగుతో ఆరోగ్యం బాగుంటుంది' అని తెలంగాణా రాష్ట్రం, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మునిసిపల్ పట్టణంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువారైతు సమ్మేళనంలో వక్తలు పేర్కొన్నారు. సేంద్రియ సాగుతో సమాజాన్ని, ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా యువ రైతులను ప్రోత్సహించేందుకు వందేమాతరం ఫౌండేషన్ (వి ఎం ఎస్), కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో



సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు

యువజన దినోత్సవం సందర్భంగా యువరైతు సమ్మేళనం నిర్వహించారు.

వి ఎం ఎస్ డైరెక్టర్ రవీంద్ర సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆదర్శ, సేంద్రియ రైతు మేక రాధాకృష్ణమూర్తి, సేంద్రియ సాగులో హోమియో విధానాన్ని మిళితం చేసి అనేక మొండి తెగుళ్ల నివారణకు మార్గం చూపిస్తున్న అమేయ కృషి వికాస కేంద్రం యజమాని దిట్ట బాల్ రెడ్డి, గచ్చిబౌలి నీట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యాం సుందర్ రెడ్డి, రైతు, తొర్రూరు డీఎస్పీ వెంకట రమణ, వీఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, ఉద్యానశాఖ అధికారి రాకేశ్ పాల్గొని రైతులకు విలువైన సూచనలను అందించారు.

నేటి యువత ఆధునిక యంత్రపరికరాలను ఉప యోగించుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే సాగు విధానాన్ని అలవర్చుకుంటే ఎలాంటి ఫలితాలు వస్తాయో రైతులు వారి అనుభవాలను ఆవిష్కరించారు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ సమాజ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ మనం మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎలా ఎదగాలని అనేకమంది యువ రైతులు వారి విజయ రహస్యాలను పంచుకున్నారు.

డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ చదివి కార్పొరేట్ కబంధ హస్తాల్లో విసిగిపోయి ప్రస్తుతం సాగుబాట పట్టిన యువ రైతులు ఎలాంటి పంటలు పండిస్తున్నారో, ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించుకుని ఏ విధంగా మార్కెటింగ్ చేస్తున్నారో వివరించారు. విచ్చలవిడిగా రసాయన పురుగు మందుల వినియోగంతో విషతుల్యమైన వాతావరణం, జీవజాలానికి వ్యాపిస్తున్న రుగ్మతలపై డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి తన పరిశోధనా ఫలితాలను సభలో వివరించారు.

మిర్చిలో వ్యాపించిన తామర పురుగు నివారణకు హోమియో మందును వినియోగిస్తే ఎలాంటి మంచి ఫలితాలు వచ్చాయో, అదే మోతాదు మించితే ఎలాంటి దుష్ఫలితాలు వస్తాయో కూడా బాల్‌రెడ్డి రైతులకు వివరించారు. వ్యవసాయ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందేలా మార్కెట్లోకి వచ్చిన ఆధునిక పనిముట్లు, మైక్రో ఇరిగేషన్లో నూతన పరికరాలు, అధిక దిగుబడులను ఇచ్చే పలు విత్తనాల కణాలు,సేంద్రియ వ్యవ సాయానికి కావాల్సిన పరికరాలు, వినియోగించే విధానం, పంటలపై తెగుళ్ల నివారణకు హోమియో మెడిసిన్ పని తీరు వంటి స్టాల్స్‌ను సమ్మేళనంలో ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా పలువురు యువ రైతులను వందే మాతరం ఫౌండేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వలంటీర్లు, ప్రతినిధులు గంట రవీందర్ రెడ్డి, వేం శ్రీధర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, దర్గయ్య, మహేందర్, ఉనిల్, సందీప్, విద్యార్థులు బొట్టుపెట్టి శాలువాకప్పి పాదాభివందనం చేసి సత్కరించారు. సమ్మేళనంలో వీఎంఎఫ్ విద్యార్థులు వ్యవసాయ నేపథ్యంపై చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలువురిని ఆలోచింపజేశాయి. ■

మొరిగే కుక్కతో ముప్పు లేదు, మొరగని కుక్కతోనే ముప్పంతా

# ఎరువుల ధరల రోకటి పోటుపై పురుగు మందుల పిడుగు !

**అ**న్నదాతల నెత్తిన మరో పిడుగు పడింది. పిచికారీ మందుల ధరలను సగటున 10 శాతం పెంచారు. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరగనున్నాయి. రెండు నెలల క్రితం ఎరువుల ధరలు దాదాపు 40 శాతం పెరిగాయి. పెట్రోలు, డీజిల్, వ్యవసాయ ఉపకరణాల ధరలు సైతం భారీగా పెరిగాయి. దీంతో సేద్యం ఇప్పటికే భారంగా మారింది. ఇప్పుడు ఆ వరుసలో పురుగు మందులు చేరాయి. నవంబరులో కురిసిన అకాల వర్షాలు పంటలను దెబ్బ తీశాయి. వివిధరకాల తెగుళ్లు సోకడంతో పురుగు మందులను పిచికారీ చేయాల్సి వచ్చింది. వర్షం, తెగుళ్ల ధాటికి పత్తి దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. రబీలో వరికి పలు దఫాలుగా పురుగు మందుల్ని పిచికారి చేయాల్సి ఉంటుంది. చీడపీడల నుంచి పంటను కాపాడుకోవాలంటే పురుగు మందుల వాడకం తప్పనిసరి. గతంతో పోలిస్తే వాటివాడకం జిల్లాలో గణనీయంగా పెరిగింది. ధరల పెరుగుదలవిషయం తెలియగానే రైతులు తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.

**వాణిజ్య పంటలకు ఎక్కువ**

మిర్చి, పత్తి తదితర వాణిజ్య పంటలకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. వరికి సైతం క్రమం తప్పకుండా మందులను పిచికారీ చేయాల్సిందే. లేదంటే పంటలు నిలబడవని రైతులు అంటున్నారు. పంటను కాపాడు కోవడానికి వారానికి రెండుసార్లు తెగుళ్ల మందులను పిచికారీ చేస్తుంటారు. పెరిగిన ధరలు మూలిగే నక్కమీద తాటికాయ పడిన చందంలా ఉందని రైతులు వాపోతున్నారు. పత్తికి మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ చీడపీడల వల్ల దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. నకిలీ పురుగు మందులు, ధరల బాదుడు రైతులకు శాపంగా మారుతున్నాయి.

**వ్యయం పెరిగిందని..**

పురుగుమందుల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు జపాన్, చైనా తదితర దేశాల నుంచి దిగుమతి అవుతాయి. అందువల్లే దేశీయంగా పురుగు మందుల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు పెరిగిన ఇంధన ధరలు పెరిగినందున రవాణా ఖర్చులు పెరిగాయి. ఆ భారాన్ని కూడా రైతులపైనే మోపుతున్నారు. కొవిడ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో విదేశాలలో సైతం ముడిపదార్థాల కొరత తలెత్తిందని, అందుకే ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.

**ప్రభుత్వానికి పట్టింపేదీ..?**

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు మద్దతు ధర లేక రైతులు ఏటా నష్టపోయి అప్పులపాలు అవుతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అంటీ ముట్టనట్లు ఉంటోంది. అయినా రైతు కష్టనష్టాలను తానే భరిస్తూ సేద్యాన్ని కొన సాగిస్తున్నాడు. ఇలాంటి సమయంలో పురుగు మందుల





ధరలను పెంచడం వారిని మరింత సంక్షోభంలోకి నెట్టడమే అని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. గతంలో ఎరువుల ధరలు పెరిగినా కొన్నింటిపై కేంద్రం రాయితీని పెంచి భారాన్ని కొంత తగ్గించింది. ఆ మేరకు రైతాంగానికి ఊరట కల్పించింది. కానీ రసాయన మందుల విషయంలో అలాంటి రాయితీలేవీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందడం లేదు. ఈ కారణంగా మొత్తం భారం రైతులపై పడుతోంది. వ్యవసాయ పెట్టుబడి ఖర్చుల్లో భారీ తేడా రానుంది. ఎకరానికి దాదాపు రూ. 2,500 వరకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయని, మిర్చికి అయితే రూ. 3,500 వరకు అదనంగా ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు ఏదో ఒక పథకం పేరిట ఉచితాలు, సబ్సిడీలు ఇస్తున్నారని, కానీ తమకు మాత్రం ఏమీ చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ■

# ఆరోగ్య బీమాలో రెండు షరతులపై జాగ్రత్త !

**ఆ**రోగ్య బీమాలో కో–పేమెంట్, డిడక్టబుల్ అనే పదాలను వినే ఉంటారు. ఆరోగ్య బీమాలో ఈ రెండు షరతులు ఉన్నాయంటే పాలసీదారుడు ఆసుపత్రి బిల్లులో కొంత మొత్తం స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. కో–పేమెంట్, డిడక్టబుల్ అంటే ఏమిటి? ఈ రెండింటికి మధ్య వ్యత్యాసమేంటి? ఏ సందర్భాల్లో ఈ నియమాలున్న పాలసీలను తీసుకోవచ్చు? దానివల్ల వినియోగదారులకు ఏ విధంగా లాభం? ఈ వివరాలు మీ కోసం...

**కో–పేమెంట్ (సహ–చెల్లింపు) అంటే...**

వైద్య ఖర్చులను మీరు, మీ బీమా సంస్థ కలిపి చెల్లించడాన్ని ఆరోగ్యబీమా సహా చెల్లింపు అంటారు. అంటే ప్రతి క్లెయిమ్‌లో పాలసీదారు నిర్ణీత శాతాన్ని సహ చెల్లింపు ఆప్షన్ కింద భరించాల్సి వస్తుంది. మిగిలిన శాతాన్ని బీమా సంస్థ చెల్లిస్తుంది.




ఉదాహరణకు రామ్ 3 లక్షల ఆరోగ్య బీమాను 10 శాతం సహ చెల్లింపుతో తీసుకున్నారనుకుందాం. అతనికి శస్త్రచికిత్సలు అవసరం ఏర్పడి, ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. అందుకుగాను లక్ష ఆసుపత్రి బిల్లు అయ్యింది. అందులో 10 శాతం, అంటే 10 వేలు రామ్ చెల్లించాలి, మిగిలిన 90 వేలు బీమా సంస్థ చెల్లిస్తుంది. ఒకవేళ ఆసుప్రతి ఖర్చులు 2లక్షలయితే.. అందులో 10 శాతం అంటే 20 వేలు రామ్ చెల్లించాలి. మిగిలిన 1.80లక్షలు బీమా సంస్థ చెల్లిస్తుంది.

**డిడక్టబుల్ (తగ్గింపు) అంటే...**

డిడక్టబుల్ ఆప్షన్ ఉన్న పాలసీలో.. కొంత మొత్తం వరకు పాలసీదారునికి ఎటువంటి చెల్లింపులు జరగవు. అంటే, ఒక ఏడాదిలో అయిన మొత్తం ఆసుపత్రి బిల్లులో మీరు ఎంచుకున్న మొత్తం వరకు బీమా సంస్థ చెల్లింపులు చేయదు. ఆ పైన అయ్యే ఖర్చులకి మాత్రమే బీమా సంస్థ చెల్లిస్తుంది. చిన్న చిన్న మొత్తాలకు కూడా వచ్చే క్లెయిములను నివారించడానికి, కొన్ని బీమా సంస్థలు ఈ షరతు విధిస్తుంటాయి.

ఉదాహరణకు రాజ్ 1,00,000 డిడక్టబుల్‌తో పాలసీ తీసుకున్నాడు అనుకుందాం. జనవరిలో ఫ్లూ కారణంగా ఆసుప్రతిలో చేరితే 12 వేల ఖర్చయ్యింది. ఈ మొత్తం బిల్లును రామ్ చెల్లించాలి. పాలసీ క్లెయిమ్ చేసే అవకాశం లేదు. మార్చిలో యాక్సిడెంట్ కారణంగా ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఇందుకు 1,20,000 బిల్లు అయితే ఇందులో నుంచి 88,000 బిల్లు రామ్ చెల్లించాలి. మిగిలిన 32,000 బిల్లు బీమా సంస్థ చెల్లిస్తుంది. జనవరిలో చెల్లించిన 12 వేలు, ఇప్పుడు కట్టిన 88 వేలు కలిపితే లక్ష అవుతుంది. అంటే రాజ్ ఎంచుకున్న లక్ష పూర్తయింది. దీంతో హెల్త్ పాలసీ ఫోర్స్‌లోకి వస్తుంది.

ఆ తర్వాత రామ్ ఏ మెడికల్ బిల్లు (పాలసీ పరిధిలోకి వచ్చే) నైనా బీమా సంస్థ చెల్లిస్తుంది. జూన్‌లో రాజ్ మళ్లీ ఆసుపత్రిలో జాయిన్ అయితే బిల్లు 50 వేలు అయ్యింది అనుకుందాం. ఇప్పుడు ఈ మొత్తం బిల్లును బీమా సంస్థే చెల్లిస్తుంది.

**రెండింటికి వ్యత్యాసం ఏంటి?**

డిడక్టబుల్ విధానంలో ఒక సంవత్సరంలో అయిన మొత్తం వైద్యం ఖర్చులలో ముందుగా నిర్ణయించిన మొత్తాన్ని పాలసీదారుడు చెల్లించాలి. ఆ తరువాత ఖర్చయిన మొత్తాన్ని బీమా సంస్థ చెల్లిస్తుంది. సహ చెల్లింపులో క్లెయిమ్ చేసిన ప్రతిసారి బిల్లు మొత్తంలో నిర్దిష్ట భాగాన్ని బీమా చేసిన వ్యక్తి చెల్లించాలి. సాధారణ పాలసీలకు వర్తించే ప్రీమియం కంటే ఈ ఆప్షన్లతో వచ్చే పాలసీల ప్రీమియం కొంచెం తక్కువగా ఉంటుంది.

వేధింపు మితిమీరితే ఎంత చిన్న ప్రాణి అయినా తిరగబడుతుంది

**సహ చెల్లింపు పాలసీలను ఎప్పుడు తీసుకోవచ్చు?**

తీవ్రమైన అనారోగ్యం లేకుండా, శారీరకంగా దృఢంగా వున్న వారైతే సహ చెల్లింపు ఆప్షన్ ఉన్న పాలసీని తీసుకోవచ్చు. ఈ పాలసీలో ప్రీమియం తక్కువగా ఉంటుంది. దురదృష్టవశాత్తు ఏమైనా జరిగినా బీమా సంస్థ చికిత్సకు అయ్యే ఖర్చులను చాలా శాతం భర్తీ చేస్తుంది.

**డిడక్టిబుల్ ఆప్షన్‌తో ఎప్పుడు తీసుకోవచ్చు?**

సాధారణంగా టాపప్, సూపర్ టాపప్ పాలసీలలో డిడక్టిబుల్ ఆప్షన్ ఉంటుంది. అంటే, మీకు ఇప్పటి సాధారణ ఆరోగ్య బీమా పాలసీఉండి కవరేజ్‌ని మరింత పెంచుకోవాలి అనుకున్నప్పుడు ఈ ప్లాన్లను ఎంచుకోవచ్చు. టాపప్ ప్లాన్‌లో చేసే ప్రతీ క్లెయిమ్‌ను డిడక్టిబుల్ లిమిట్ ఆధారంగానే నిర్ణయిస్తారు. ఈ పరిమితి మించితేనే అదనపు క్లెయిమ్ వర్తిస్తుంది. ఈ లిమిట్ వరకు బేసిక్ పాలసీతో కవర్ చేసుకోవచ్చు. సూపర్ టాపప్ ప్లాన్‌కూడా టాప్ అప్ ప్లాన్ మాదిరిగానే పని చేస్తుంది. అయితే ఇందులో ఒక సంవత్సరంలో చేసే మొత్తం క్లెయిమ్‌లను పరిగణనలోకి తీసుకుంటారు.

ఉదాహరణకు... కృష్ణ 3 లక్షల కవరేజీతో బేస్ పాలసీ తీసుకున్నాడనుకుందాం. దీనికి అదనంగా 5 లక్షలకు టాప్ అప్ ప్లాన్‌ను తీసుకున్నారని అనుకుంటే.. వైద్య ఖర్చులు 3 లక్షలు దాటిపోతే టాప్ అప్ ప్లాన్ ఫోర్స్‌లోకి వస్తుంది. 3 లక్షల వరకు బేసిక్ పాలసీని నుంచి, 2 లక్షలు టాప్ అప్ పాలసీ నుంచి క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ రామ్ 10 లక్షలకు, 5లక్షల త్రిషోల్డ్ లిమిట్‌తో సూపర్ టాప్ ప్లాన్ తీసుకుంటే ఆ సంవత్సరంలో 5 లక్షలకు మించి అయిన బిల్లును సూపర్ టాప్ అప్ ప్లాన్ నుంచి చెల్లించవచ్చు. అదే ఏడాదిలో 5 లక్షల బిల్లు పరిమితి అప్పటికే దాటి ఉంటే, మరోసారి చిన్న మొత్తంలో బిల్లు చెల్లించాల్సి వచ్చినా సూపర్ టాప్ ఉపయోగపడుతుంది.

**గమనిక:** ఆరోగ్య బీమాను కొనుగోలు చేసినప్పుడు సహ చెల్లింపులు, డిడక్టబుల్ ఉంటే ప్రీమియం కొంత వరకు తగ్గుతుంది. అయితే ప్రీమియం తగ్గించుకునేందుకు ప్రయోజనాల విషయంలో రాజీ పడకూడదు. ■



## 37 సంవత్సరాల రైతు కష్టానికి 'పద్మశ్రీ'!

*మహాలింగ నాయక్ ఒక వ్యవసాయ కూలీ హరిత విప్లవకారుడు. 'వన్-మ్యాన్-ఆర్మీ' తన రెండు ఎకరాల బంజరు భూమిని సేంద్రియ వ్యవసాయంతో పచ్చటి పొలంగా మార్చిన మహనీయుడు .....*

*కర్ణాటకలోని మంగళూరు సమీపంలోని ఒక కొండ మీద తన పొలంలో 300 పైగా వక్క చెట్లు, 75 కొబ్బరి చెట్లు, 150 జీడి చెట్లు, 200 అరటి మొక్కలు, మిరియాల తీగలు పెంచి వ్యవసాయంలో సాధించిన ప్రతిభకు నేడు పద్మశ్రీ అవార్డు! అభినందనలు రైతన్నా....!* ■

## డ్రోన్ల కొనుగోలుకు రూ.10 లక్షల గ్రాంట్

**ఐసీఏఆర్ సంస్థలకు, కేవీకేలకు, వ్యవసాయ వర్సిటీలకు...**

కేంద్ర ప్రభుత్వం సాయాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో డ్రోన్ల కొనుగోలుకు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్)కి చెందిన సంస్థలకు, కృషి విజ్ఞాన కేంద్రాల (కేవీకే)కు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు 10 లక్షల రూపాయల వరకు గ్రాంట్ ఇవ్వనుంది. ఈ నిధులు దేశీయ డ్రోన్ల ఉత్పత్తికి కూడా దోహదపడతాయని కేంద్ర వ్యవసాయ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ రంగు డ్రోన్ల సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి తగిన మార్గదర్శకాలను జారీచేసింది. డ్రోన్ల కొనుగోలుకు అయ్యే వంద శాతం గానీ, 10 లక్షల రూపాయలకు గానీ, అది అందజేస్తారు. ■

# వంట నూనెను ఇలా వాడితేనే మేలు!

సాధారణంగా అందరూ ఆరోగ్యకరమైన ఆహారం గురించే మాట్లాడతారు. కానీ, ఆరోగ్యకరంగా ఆహారం వండడం గురించి ఎక్కువగా మాట్లాడరు. ఈ క్రమంలో హెల్దీ కుకింగ్‌లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది నూనె వాడకం. సాధారణంగా మన వంటల్లో నూనె కొంచెం ఎక్కువగానే ఉంటుంది. మనకు తెలియకుండానే తీసుకునే ఈ ఆయిల్ వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఈ క్రమంలో ఆయిల్ వాడకానికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు.



**నూనెను నీళ్లలా వాడితే అంతే!**

నూనె లేని వంటలు ఆరోగ్యానికి మంచివని తెలిసినా... వంటకానికి మంచి రుచి కావాలంటే గిన్నెలో ఆయిల్ పడాల్సిందే. అయితే నూనెను ఎలా పడితే అలా నీళ్లలా వాడితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మనం వినియోగించే అన్ని రకాల నూనెల్లోనూ ఎసెన్షియల్ ఫ్యాట్స్ ఉంటాయి. వీటిని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కొవ్వుల శాతం పెరిగిపోతుంది. ఇవి ధమనుల్లోని రక్త ప్రవాహానికి అడ్డుపడతాయి. ఫలితంగా హార్ట్ ఎటాక్, గుండెపోటు, బ్రెస్ట్, ఒవేరియన్ క్యాన్సర్, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఊబకాయం, కీళ్ల నొప్పులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ క్రమంలో నూనె వాడకంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రుచికరమైన ఆహారంతో పాటు ఆరోగ్యమూ సొంతమవుతుంది.

**నూనెను తగ్గిద్దామిలా!**

- వేపుళ్ల బదులు తాలింపు, బేకింగ్, గ్రిల్లింగ్, స్టీమింగ్‌కు ప్రాధాన్యమివ్వండి. దీంతో ఎ, డి, కె-విటమిన్లు శరీరానికి పుష్కలంగా అందుతాయి.
- ఫ్రైడ్ స్నాక్స్‌కి బదులు రోస్ట్ చేసిన, లేదా స్టీమ్ చేసిన స్నాక్స్‌ను తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది.
- నూనెలు కాస్త తక్కువగా వాడేవారు... వంటలో పొరపాటున కాస్త ఎక్కువైతే తినడానికి ఇబ్బంది పడతారు. ఇలాంటప్పుడు నూనెను కొలత ప్రకారం వాడుకోవడమే అందుకు సరైన పరిష్కారం. ఇందులో భాగంగా డైరెక్ట్‌గా బాటిల్‌లో నుంచి నూనెను పోసే బదులు టీస్పూన్ లాంటి వాటితో ఆయిల్ వేయండి. అప్పుడు ఎంత నూనె వాడుతున్నారో మీకు తెలుస్తుంది.
- ఎల్లప్పుడూ ఒకే నూనెను కాకుండా కాంబినేషన్ ఆయిల్స్‌ను వాడితే మంచిది. సన్‌ఫ్లవర్, రైస్ బ్రాన్, నువ్వులు, వేరుశెనగ, కొబ్బరి నూనెల్లో ఉండే మోనోశ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, పాలీ అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ మన బాడీకి చాలా అవసరం. మన శరీరం వాటిని స్వయంగా తయారు చేసుకోలేదు. వంట నూనె ద్వారానే అవి శరీరానికి అందుతాయి. అందుకే వేరు వేరు నూనెల్ని కలిపి వాడుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి.
- అప్పడాలంటే అందరికీ ఇష్టమే. కానీ ఇవి వేయించాలంటే చాలా నూనె కావాలి. దీని కారణంగా అందులో ఉండే ఆరోగ్య ప్రయోజనాలన్నీ కూడా ఆవిరైపోతాయి. కాబట్టి అప్పడాలని సన్నటి మంట పైన కాల్చుకుంటే ఆయిల్ వాడాల్సిన అవసరమే ఉండదు.
- నూనె వినియోగానికి సంబంధించి నెలకు ఎంత వాడుతున్నామో ఒక లెక్క వేసి చూసుకోండి. అప్పుడు

**అనుకున్నది నెరవేరనప్పుడు మరింత తపన,మరింత కృషి, చెదరని చిరునవ్వు మరింతగా అవసరం**

మీకు కూడా ఒక అవగాహన వస్తుంది. దీన్ని బట్టి అవసరం అనుకుంటే ఈ టిప్స్ ద్వారా నూనె వాడకాన్ని తగ్గించవచ్చు.

- వేపుళ్లకి వాడిన నూనెని మళ్లీ వేయించడానికి ఉపయోగించకండి. ఇందువల్ల శరీరంలోకి ట్యాక్సిన్స్ చేరే ప్రమాదం ఉంది.

**ఇవి కూడా పాటించండి!**

- వంట నూనెను ఎక్కువసేపు వేడిచేస్తే అందులో ఉండే విటమిన్లు శరీరానికి అందవు. అంతేకాదు... ఏ నూనె నైనా నాలుగుసార్ల కంటే ఎక్కువ వేడి చేసి వాడకూడదు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఇప్పటికే వాడిన నూనెతో తాజా నూనెను కలపకండి.
- నూనెను వేడి చేసినప్పుడు వాటి టెంపరేచర్ కూడా మారుతుంది. ఏ టెంపరేచర్ వద్ద నూనె పొగ రావడం మొదలు పెడుతుందో దానిని 'స్మోకింగ్ పాయింట్' అంటారు. దీనిపై కొంచెమైనా అవగాహన కలిగి ఉండాలి. ప్రత్యేకించి ఫ్రై చేయాల్సిన అవసరం వస్తే ఎక్కువ స్మోకింగ్ పాయింట్ ఉన్న నూనెను మాత్రమే వాడాలి. డబుల్ రిఫైన్డ్ ఆయిల్స్‌ను ఎంత వేడి చేసినా వాటి నుంచి పొగ రాదు. అదే వేరుశెనగ, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలను వేడి చేస్తే పొగలు వస్తాయి.
- ఒకసారి వాడిన నూనెను మరోసారి వాడే ముందు పాత్రలో అడుగున ఉన్న ఆయిల్‌ను వదిలేస్తే మంచిది. లేదంటే వడగట్టుకుని వాడాలి.
- వంట నూనెపై సూర్యరశ్మి పడకుండా చూడాలి. నేరుగా ఎండ పడడం వల్ల నూనెలో కొన్ని రసాయనిక మార్పులు జరిగే అవకాశం ఉంది.
- వంట నూనె కొనే ముందు అందులో ఉన్న కొవ్వు శాతం చూసి మరీ కొనాలి. వంటకు వాడే నూనెలో 8 నుంచి 10 శాతం శ్యాచురేటెడ్ కొవ్వు ఉండాలి. అంతకన్నా ఎక్కువ ఉంటే ఆరోగ్యానికి ప్రమాదకరం.

(ఈనాడు సౌజన్యంతో)

■

## అణు ఇంధన నౌకకు మహిళా కమాండర్

**అ**మెరికా నౌకా దళ చరిత్రలో మొట్టమొదటిసారిగా అణు ఇంధనంతో నడిచే విమానవాహక నౌకకు ఓ మహిళ నాయకత్వం వహిస్తున్నారు. అణుశక్తి నౌక యు.ఎస్.ఎస్. అబ్రహం లింకన్ సారథిగా నియమితులైన కెప్టెన్ బావరిట్ ఆ అరుదైన గౌరవం చేజిక్కించుకున్నారు. అబ్రహాం లింకన్



నౌక సమూహంలో అత్యాధునిక యుద్ధ విమానాలు, ఒక గైడెడ్ మిసైల్ క్రూయిజర్ నాడ, మూడు డిస్ట్రాయర్ నౌకలు ఉంటాయి. ఈ సమూహం ఇండో–పసిఫిక్ జలాలకు పయనమై వెళుతోంది. అబ్రహం లింకన్ నౌక 294 రోజుల పాటు ప్రపంచ సముద్రాలను చుట్టి వచ్చిన తరవాత ఏప్రిల్ నుంచి మరమ్మతు పనులు పూర్తి చేసుకుని సోమవారం తిరిగి సముద్ర ప్రవేశం చేసింది. బావర్‌ష్మిట్ గతంలో హెలికాప్టర్ సముద్ర దళానికి నాయకత్వం వహించారు. ఆమెకు మొత్తం 3,000 గంటలసేపు విమానాలు, హెలికాప్టర్లను నడిపిన అనుభవం ఉంది. గత ఏడాది ఆగస్టులో కెప్టెన్ వాల్ట్ స్లాటర్ నుంచి బావర్‌ష్మిట్ కమాండర్ బాధ్యతలు స్వీకరించారు.

## ఆంగ్‌సాన్ సూకీకి మరో నాలుగేళ్ళ జైలు

**మ**యన్మార్ పదవీచ్యుత ప్రధాని ఆంగ్‌సాన్ సూకీకి ఆ దేశ కోర్టు మరో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. వాకీ టాకీలను అక్రమంగా దిగుమతి చేసుకుని కలిగి ఉండడం, కరోనా వైరస్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి అభియోగాలు ఎదుర్కొంటున్న సూకీని దోషిగా తేల్చిన కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించినట్టు మయన్మార్ ప్రభుత్వం తెలిపింది.

■

కుటుంబ సభ్యులపట్ల ఓర్పు ప్రేమకు చిహ్నం, ఇతరుల పట్ల ఓర్పు గౌరవానికి సంకేతం

# ఉదయాన్నే నిమ్మ రసం...ఆరోగ్యానికి అభయం!

**చి**న్న చిన్న అలవాట్లే కావొచ్చు. చూడటానికి తేలికగానే అనిపించొచ్చు. కొందరు అసలే పట్టించుకోకపోనూవచ్చు. కానీ అవి మన ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. అలాంటిదే నిమ్మరసం నీరు. ఉదయం పూట నిమ్మరసం కలిపిన నీళ్లు తాగితే కలిగే ప్రయోజనాలు తెలుసుకుంటే మీరు ఆశ్చర్యపోవటం ఖాయం.

**జీర్ణశక్తి మెరుగు :**

మనం తిన్న ఆహారం అరగటానికి జీర్ణాశయంలోని ఆమ్లాలు తోడ్పడతాయి. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ వీటి స్థాయిలు తగ్గుతూ వస్తుంటాయి. నిమ్మరసంలోని ఆమ్లాలు వీటికి చేదోడు వాదోడుగా నిలిచి..ఆహారం జీర్ణం కావటానికి దోహదం చేస్తాయి.



**నీటిశాతం పడిపోకుండా :**

మనలో చాలామంది తగినంత నీరు తాగరు. దీంతో ఒంట్లో నీటిశాతం పడిపోతుంది. దీంతో కిడ్నీలో రాళ్లు ఏర్పడటం వంటి సమస్యలూ ముంచుకొస్తాయి. అదే రోజూ ఉదయాన్నే నిమ్మరసం నీళుతాగటం అలవాటు చేసుకుంటే ఒంట్లో నీటి శాతం పడి పోకుండా చాలావరకు నివారించుకోవచ్చు. పైగా నిమ్మరసం కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండానూ కాపాడుతుంది.

**జబ్బులకు కళ్లెం**

నిమ్మకాయలో విటమిన్ సి దండిగా ఉంటుంది. సగం నిమ్మచెక్క రసం తీసుకున్నా రోజుకు అవసరమైన విటమిన్ సిలో ఆరో వంతుకు పైగా అందుతుంది. ఇది రోగనిరోధక శక్తిని పుంజుకునేలా చేయటంతో పాటు కణాలు దెబ్బతిన కుండా కాపాడుతుంది. నిమ్మరసంలోని పైటోన్యూట్రి యంట్లు యాంటీఆక్సిడెంట్లుగానూ పనిచేస్తాయి. ఇవి విశృంఖల కణాల మూలంగా తలెత్తే అనర్థాల నుంచి కాపాడతాయి.

**నాడులు హుషారు :**

నిమ్మరసంలో మెగ్నీషియం కూడా ఉంటుంది. ఇది లేకపోతే శరీరం సరిగా పనిచేయదు. నాడులు-కండరాల మధ్య సమాచారానికి ఇది అత్యవసరం. అన్ని కణాలకు పోషకాలు అందటానికి, వ్యర్థాలను బయటకు పంపటానికి ఇది తోడ్పడుతుంది. రక్తపోటుపై ఉప్పు చూపే ప్రభావాన్ని తగ్గించటానికీ మెగ్నీషియం ఉపయోగపడుతుంది.

**రోజుకు రెండు చెంచాల నువ్వులతో కొలెస్ట్రాల్ దూరం**

**ఆ**యుర్వేదంలో నువ్వులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శీతా కాలంలో నువ్వులు, బెల్లం కలిపి చేసిన లడ్డూలను వెనుకటికి పెద్దలు పిల్లలకు తిని పిస్తుండేవారు. శరీరం లోపల నువ్వులు ఉష్ణోగ్రతను పెంచుతాయి. దీంతో శీతల ప్రభా వాన్ని తట్టుకోవచ్చు. పైగా ఎదిగే పిల్లలకు క్యాల్షియం అవసరం ఉంటుంది. ఇలా చూసుకున్నా నువ్వులు చేసే మేలు చాలానే ఉంది. పిల్లలకే కాదండి నువ్వు లతో అన్ని వయసుల వారికి ఎన్నో ప్రయోజనాలున్నాయి.

నిత్యం 2 నుంచి 3 టేబుల్ స్పూన్ల పరిమాణంలో నువ్వులు తీసుకోవడంవల్ల రక్తంలో చెడు కొవ్వులు తగు తాయని న్యూట్రిషన్ రీసెర్చ్ అనే జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయన వివరాలు తెలియజేస్తున్నాయి. ఎల్డీఎల్ కొలెస్ట్రాల్ 8-16 శాతం, టోటల్ కొలెస్ట్రాల్ 8శాతం మేర రెండు నెలల్లో తగ్గుతోందని పరిశోధకులు గుర్తించారు. దీనివల్ల గుండెపోటు ముప్పును తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. చెడు కొలెస్ట్రాల్, ట్రై గ్లిజరైడ్స్ నియంత్రణకు నువ్వులు మంచి ఫలితాలను ఇస్తున్నట్టు ఈ అధ్యయన పరిశోధకులు తెలుసుకున్నారు.

చిన్న ప్రేగు కొలెస్ట్రాల్‌ను గ్రహించకుండా నువ్వుల్లోని సిసామిన్ అడ్డుకుంటుందని చెబుతున్నారు. హెచ్ ఎంజీసీవోఏరెడుక్టేస్ అనే ఎంజైమ్యాక్టివిటీని సిసామిన్ తగ్గిస్తుంది. శరీరం కొలెస్టరాల్‌ను గ్రహించడానికి కారణమయ్యే ఎంజైమ్ ఇది. ■

కోపమెందుకు? నీవు చెప్పేది సరైనదైతే కోపంతో పనిలేదు, సరైనది కాకుంటే కోపించే అర్హత లేదు

# కుంకుళ్ళను ఎన్నో రకాలుగా ఉపయోగించవచ్చు !

ఒకప్పుడు తలస్నానం చేయడానికి కుంకుడు కాయలనే ఉపయోగించేవారు. అయితే ఆ తర్వాత మార్కెట్లోకి షాంపూలు అందుబాటులోకి వచ్చాక వాటి వాడకం బాగా తగ్గింది. అయినా మన అమ్మ, బామ్మల తరానికి చెందినవారు నేటికీ కుంకుడు కాయలతోనే తలస్నానం చేయడానికి ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ఎందుకంటే ఇది జుట్టుకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కేవలం శిరోజాలను శుభ్రపరచడానికే కాకుండా ఇంట్లో ఇతరత్రా పనులకు కూడా వీటిని ఉపయోగించవచ్చు. ఆశ్చర్యంగా ఉంది కదా.. తెలుసుకుందాం రండి..

**లిక్విడ్ సోప్‌గా..**

ప్రతి కప్పు నీటికి రెండు కాయల చొప్పున కుంకుళ్లు, నీళ్లు తీసుకోవాలి. వీటిని కలిపి ముప్ఫై నిమిషాల పాటు మరగనివ్వాలి. ఆ తర్వాత పూర్తిగా చల్లారనివ్వాలి. ఆ తర్వాత పలుచని వస్త్రాన్ని తీసుకొని వడపోసుకోవాలి. దీనికి మీకు నచ్చిన ఫ్లేవర్‌లోని అరోమా ఆయిల్‌ని కలుపుకోవాలి. అనంతరం శుభ్రంగా కడిగి పొడిగా ఆరబెట్టుకున్న బాటిల్‌లో ఈ మిశ్రమాన్ని పోసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. దీన్ని స్నానం చేసేటప్పుడు సబ్బుకి బదులుగా ఉపయోగించవచ్చు.

**గ్లాస్ క్లీనర్‌గా..**

కిటికీల అద్దాలను తుడవడానికి సాధారణంగా మార్కెట్లో దొరికే క్లీనింగ్ లిక్విడ్‌లను ఉపయోగిస్తాం. అయితే వీటికి బదులుగా కుంకుడు కాయలను ఉపయోగించి కూడా ఇంట్లోనే గ్లాస్‌క్లీనర్‌ను తయారు చేసుకోవచ్చు. దీనికోసం కుంకుడు కాయలతో తయారుచేసుకున్న లిక్విడ్ సోప్ ఒక టేబుల్ స్పూన్, రెండు టేబుల్ స్పూన్ల వైట్ వెనిగర్, అరకప్పు నీటిని తీసుకొని బాగా కలుపుకోవాలి. దీన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేయాలి. అనంతరం దీన్ని కిటికీ అద్దంపై స్ప్రే చేసి మెత్తటి వస్త్రంతో తుడిచేయాలి.

**పట్టు వస్త్రాలకు..**

డిటర్జెంట్ సోప్, డిటర్జెంట్ పౌడర్‌లో ఉండే రసాయనాల కారణంగా దుస్తులు త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పట్టు, జరీ దుస్తులపై ఈ రసాయనాల ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. అందుకే వీటిని ఉతకడానికి డిటర్జెంట్‌కి బదులుగా కుంకుళ్లను వాడితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. దీనికోసం ఎనిమిది కుంకుడు కాయలను చల్లటి నీటిలో నానబెట్టి వాటి రసాన్ని తీసుకోవాలి. దీన్ని దుస్తులు ఉతకడానికి ఉపయోగించవచ్చు.

**కిచెన్ క్లీనర్‌గా..**

అరకప్పు కుంకుడు కాయ రసానికి రెండు చెంచాల వైట్ వెనిగర్, కొద్దిగా నీరు కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో వేసి బాగా షేక్ చేసుకోవాలి. దీంతో కిచెన్ ప్లాట్‌ఫాం, వాష్‌బేసిన్ లాంటివి శుభ్రం చేసుకోవచ్చు.

**నగలు శుభ్రపరచడానికి..**

బంగారం, వెండితో తయారుచేసిన ఆభరణాలను, వస్తువులను శుభ్రం చేయడానికి కూడా కుంకుళ్లు బాగా ఉపయోగపడతాయి. దీనికోసం కుంకుడుకాయ రసంలో వాటిని కాసేపు నానబెట్టాలి. అనంతరం మెత్తని బ్రష్‌తో మృదువుగా రుద్దితే సరిపోతుంది. ఇది సహజసిద్ధమైనది కాబట్టి ఆభరణాలు నల్లగా మారతాయన్న భయం ఉండదు.

**దోమల బారినుంచి..**

దోమల బారినుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి మస్కిటో రిపెల్లెంట్స్‌ని ఉపయోగించడం సాధారణంగా జరిగేదే. అయితే వీటిని రసాయనాలు ఉపయోగించి తయారు చేస్తారు. ఫలితంగా అలర్జీలు, శ్వాస సంబంధమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కుంకుడు కాయలను దోమల రిపెల్లెంట్‌గా ఉపయోగిస్తే అలర్జీల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. దీనికోసం కుంకుడు కాయలతో తయారు చేసిన లిక్విడ్‌సోప్‌ను శరీరానికి రాసుకోవాలి. ఇలా చేస్తే దోమలు కుట్టకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ■

జీవితంలో ప్రతి పరీక్ష మన సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది, లేదా చేతగానితనాన్ని చాటుతుంది

## సత్య నాదెళ్ళ , సుందర్ పిచాయ్ , భారత్ బయోటెక్ అధినేతలకు పద్మభూషణ్

# గరికపాటికి, మొగులయ్యకు, పద్మజా రెడ్డికి పద్మశ్రీ



**కేం**ద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులను ప్రకటించింది. ఈ ఏడాది 128 మందికి పద్మ పురస్కారాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ లకు పద్మభూషణ్ ప్రకటించారు.

ఇక, ఈ ఏడాది నలుగురికి పద్మ విభూషణ్ పురస్కారాలు ప్రకటించారు. వీరిలో దివంగత సైనికాధికారి బిపిన్ రావత్ కూడా ఉన్నారు. ఆయనకు మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించారు. దివంగత రాజకీయవేత్త కల్యాణ్ సింగ్, సాహితీ, విద్యారంగాలకు చెందిన రాధేశ్యామ్ ఖేమ్కా కళాకారిణి ప్రభా అత్రేలకు కూడా పద్మవిభూషణ్ ప్రకటించారు.

ఈ ఏడాది 17 మందికి పద్మభూషణ్ ప్రకటించారు. భారత్ బయోటెక్ అధినేతలు కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా పద్మభూషణ్ కు ఎంపికయ్యారు. సీరం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత సైరస్ పూనావాలా కూడా పద్మభూషణ్ జాబితాలో ఉన్నారు.

పద్మశ్రీ అవార్డుల విషయానికొస్తే ఏపీకి చెందిన ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుకు, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణ రావుకు పద్మశ్రీ ప్రకటించారు. కళల విభాగంలో తెలంగాణకు చెందిన 12 మెట్ల కిన్నెర కళాకారుడు మొగులయ్య, పద్మజా రెడ్డి పద్మశ్రీకి ఎంపికయ్యారు.


12 మెట్ల కిన్నెర కళాకారుడు మొగులయ్యకు పద్మశ్రీ ప్రకటించారు. మొగులయ్య ఇటీవల పవన్ కల్యాణ్ హీరోగా నటించిన భీమ్లా నాయక్ చిత్రంలో పాట పాడిన సంగతి తెలిసిందే. నాగర్‌కర్నూలు జిల్లా తెల్కపల్లి మండలం గట్టురాయిపాకుల గ్రామంలో 1951లో జన్మించిన ఆయన పూర్తి పేరు దర్శనం మొగులయ్య. ఆయన 52 దేశాల ప్రతినిధుల ముందు తన 12 మెట్ల కిన్నెర గానంతో ప్రదర్శనలను ఇచ్చారు. మొగులయ్య జీవిత చరిత్ర తెలంగాణ ఎనిమిదవ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశంగా కూడా ఉంది. ఆయన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015లో ఉగాది విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ■

### హిమప్రియ, విరాట్ చంద్రలకు బాల పురస్కార్!

**ధై**ర్యసాహసాలు, వివిధ రంగాల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన బాలలకు కేంద్రం అవార్డులు ప్రకటించింది. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు 29 మంది బాలలు ఎంపిక అయ్యారు. వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఇద్దరున్నారు. ఏపీకి చెందిన గురుగు హిమప్రియ, తెలంగాణకు చెందిన తేలుకుంట విరాట్ చంద్ర కేంద్ర పురస్కారం అందుకోనున్నారు.



ప్రధానమంత్రి బాల పురస్కార్‌కు ఎంపికైన వారికి జనవరి 24న డిజిటల్ సర్టిఫికెట్లు అందజేశారు. బాల పురస్కార్ అవార్డు గ్రహీతలతో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో భేటీ అయ్యారు. ■



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-02-2022 ; Posting Date: 05 & 06-02-2022

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

# భారత గణతంత్ర దినోత్సవ సంరంభం !





హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో .. పెద్ద వడుగూరు ఎఫ్ పి ఓ చే ... పామిడి లో ...





ఎం టమాట సమాఖ్య సమావేశంలో, తంబళ్ళ పల్లిలో, హైదరాబాద్ లో ఎస్ బి ఐ సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి పాల్గొన్న దృశ్యాలు






చిత్తూరు జిల్లాలోని 6 మండలాల మామిడి రైతులకు శిక్షణ ... రెడ్డిపల్లిలో పశుపోషణపై 'కేవ్' శిక్షణ ... ధరణి ఎఫ్ పి ఓ పాలకవర్గానికి శిక్షణ







ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎఫ్ పి ఓల పాలకవర్గాలకు శిక్షణ ... బాసర ఎఫ్ పి ఓ పాలకవర్గ సమావేశం ... కుబీర్ లో 'వాష్' శిక్షణ


కర్నూలు, అనంతపురం, కడప,చిత్తూరు జిల్లాలలో
నాబార్డ్ ఆధ్వర్యంలోని ఎఫ్ పి ఓల సి ఇ ఓ లకు శిక్షణ

To ADDRESS

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089